ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

# ఏలూరు

జిల్లా వార్తలు

5

బుధవారం 18 డిసెంబరు 2024

## 169 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఏలూరు సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 169 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులలో 7955 మంది హాజరై 1944 అర్జీలు ఇచ్చారని, వాటిలో అక్కడికక్కడే 217 అర్జీలను పరిష్కరించినట్లు జేసీ వివరించారు. జనవరి 8 వరకు ఆయా గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని ప్రజలు తమ భూముల సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందవచ్చని ఆమె తెలిపారు.

# దుమ్ము.. ధూళి..



రహదారిపై దుమ్ము రేపుతున్న ఆర్టీసీ బస్సు

- కుక్కునూరు-భద్రాచలం రహదారి పనులు సగం.. సగం..
- నెలల తరబడి పనుల్లో జాప్యం
- దుమ్ముకొట్టుకుపోతున్న వాహనదారులు

కుక్కునూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు-భద్రాచలం, కుక్కునూరు- అశ్వారావుపేట ప్రధాన రహదారిలో రెండు నెలల క్రితం వరకు భారీ గుంతలతో వాహనదారులు నరకం చూశారు. ఎట్టకేలకు రహదారి పనులు చేపట్టడంతో సమస్య పరిష్కారమవుతుందని భావిస్తే దుమ్ము, ధూళితో నానా తిప్పలు పడుతున్నారు. రహదారి పనులు నత్తనడకన సాగడంతో ప్రజలు మళ్లీ నరకం చూస్తున్నారు. ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి నిర్మాణ పనులు రెండు నెలల క్రితం చేపట్టారు. 35 కిలో మీటర్ల మేర రోడ్డు తవ్వి వెట్‌మిక్స్‌తో నిర్మాణం చేపట్టారు. బీటీ నిర్మాణం జరపాల్సి ఉంది. ఇప్పటివరకు బీటీ పనులు చేపట్టకపోవడంతో వెట్ మిక్స్ పైనే రాకపోకలు సాగిస్తున్నారు. వెట్‌మిక్స్ కూడా తడపకపోవడంతో ఏదైన వాహనం వెళితే దుమ్ము వెనుక ద్విచక్ర వాహనదారులు దుమ్ము కొట్టుకుపోతున్నారు. కళ్లలో దుమ్ముపడి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో గుంతల్లో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు చూస్తే దుమ్ముతో చస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కునూరు మండల కేంద్రంలో కిలోమీటరు మేర మాత్రమే రహదారి తడుపుతున్నారు. మిగిలిన ప్రాంతం తడపకపోవడంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. రాకపోకలకే కాదు రోడ్డు పక్కన పంటలకు సైతం దుమ్ము కారణంగా నష్టం తప్పడం లేదు. ఈ సమస్య నుంచి బయట పడడానికి రైతులు తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారు. వింజరంలో ఒక రైతు మిర్చి పంటను కాపాడుకునేందుకు రహదారి పక్కనే అడ్డుగా ఒక బరకాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. పత్తిపంటపై కూడా దుమ్ము పేరుకుపోయి రైతులు నష్టపోతున్నారు.





మిర్చి పంటపై దుమ్ము పడకుండా కట్టిన తెర

### బిల్లులు చెల్లించలేదు..?

రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు దాదాపు రూ.7కోట్లు పైగా బిల్లు రావాల్సి ఉంది. బిల్లు చెల్లింపులో ఆలస్యంతో పనుల్లో జాప్యం జరిగినట్లు సమాచారం. అధికారులు వెంటనే స్పందించి రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, అధికారులు, విద్యార్థులు

## ఇంధన పొదుపుతో మంచి భవిష్యత్

- విద్యుత్‌ను పొదుపు చేద్దాం
- ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

ఏలూరు సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంధనం పొదుపు చేయడం ద్వారా భావి తరాలకు మంచి భవిష్యత్ ఇవ్వవచ్చని అధికారులు, ఎమ్మెల్యేలు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఫైర్‌స్టేషన్ మీదుగా ఆర్‌ఆర్‌పేటలోని విద్యుత్ భవనం వరకు విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇంధన పొదుపుపై అవగాహన కలిగించే పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, జేసీ ధాత్రిరెడ్డి ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ అవసరమైన సమయంలోనే విద్యుత్ ఉపయోగించుకోవడం ద్వారా ఆదా చేయాలని సూచించారు. ఇంధన వనరుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని ఆమె స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ భావి తరాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలన్నారు. సూర్యఘర్ వంటి పథకాల ద్వారా లబ్ధిపొందాలన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ విద్యుత్‌ను సోలార్ ఇంధన పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం ఇస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి సాల్మన్ రాజు మాట్లాడుతూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ వినియోగంపై గ్రామాల్లో జానపద కళాకారులు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, స్వయం సహాయక సంఘాల మహిళా బృందాలతో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ కెఎం అంబేడ్కర్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న చెట్టున్నపాడు దళిత కుటుంబాలు

## రక్షణ కల్పించండి

- గ్రామ పెద్దలతో ఇబ్బందులు
- చెట్టున్నపాడు దళితుల ఆందోళన
- కలెక్టరేట్ వద్ద ధర్నా
- డీఎస్పీ కార్యాలయంలో వినతి

ఏలూరు రూరల్ / క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం చెట్టున్నపాడు దళిత కుటుంబాల్లో 18 మంది గ్రామ పెద్దల వల్ల ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని దళితులు వాపోయారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ పలు దళిత కుటుంబాల వారు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వోను కలిసి వినతిపత్రం అందజేశారు.

గ్రామంలో 2013 నుంచి నేటి వరకు 18మంది గ్రామపెద్దలు తమ అభిప్రాయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అగ్రవర్ణాల వారు, ఆగడాల లంక నుంచి వలసవచ్చిన వారితో చేపల చెరువు లీజు వ్యవహారాల్లో స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రశాంతంగా జీవిస్తున్న దళితుల మధ్య చిచ్చుపెడుతున్నారని వాపోయారు. గ్రామంలో ఇరు వర్గాల దళితుల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొందన్నారు. ఒక వర్గం దళితులు మరో వర్గం దళితుల్లో ముగ్గురిని హత్యచేసే స్థాయికి తెచ్చారన్నారు. 18 మంది కుల పెద్దల నుంచి తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మెజార్టీ కుటుంబాలను చెరువుల వాటాల నుంచి తప్పించి ఆర్థిక ఇబ్బందులకు గురి చేయటమే కాకుండా సాంఘిక కుల బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చేపలచెరువు లీజు, ఏడాదికి రూ.3కోట్లు వస్తుంటే కుల పెద్దలుగా చెప్పుకునే గ్రామపెద్దలు ఇతరులతో చేతులు కలిపి తమను మోసం చేస్తున్నారని న్యాయం చేయాలని కోరారు.

అక్కడి నుంచి ఏలూరు డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఇబ్బందులకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిగురుపాటి శ్రీనివాసరావు, యర్లపాటి ప్రకాశరావు, దండే సురేష్‌కుమార్, సిహెచ్ రత్నాకర్, దండే రాణి, జయమణి, దేవదాసి అనిత తదితరులు పాల్గొన్నారు.

## చినుకు.. వణుకు!



- అల్పపీడన ప్రభావంతో మబ్బులు
- అక్కడక్కడా తేలికపాటి వర్షాలు
- రైతుల్లో ఆందోళన
- హడావుడిగా ధాన్యం చేరవేత
- ధాన్యం రాశులపై బరకాలు

7

అప్పుడు ... ఇప్పుడు

# కయ్యం.. వియ్యం



## నేడు ఆళ్ల నాని టీడీపీలో చేరిక

- ఏలూరు రాజకీయాల్లో అతి పెద్ద మలుపు
- సీనియర్‌గా నాని రాకతో మరింత బలం
- తొలుత వ్యతిరేకించినా సర్దుకున్న కేడర్
- సీఎం చంద్రబాబు సమక్షంలోనే అట్టహాసంగా చేరిక

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఏలూరు నియోజకవర్గంలో అనూహ్య మార్పులు జరుగుతున్నాయి. టీడీపీలో చేరేందుకు చాలా కాలం నుంచే మాజీ మంత్రి, సీనియర్ నేత ఆళ్ల నాని ప్రయత్నించారు. టీడీపీలో కొందరు ఆయనకు ఊతమిచ్చారు. బలమైన సామాజిక వర్గానికి చెందిన నానిని పార్టీలోకి తీసుకోవాలన్న నిర్ణయం రెండు వారాల క్రితమే ఖరారైంది. అప్పటి నుంచి ఏలూరులో టీడీపీ శ్రేణులన్నీ తీవ్ర అసంతృప్తితో భగ్గుమన్నాయి. ఆయన రావడానికి వీల్లేదంటూ సోషల్ మీడియా వేదికగా నిరసనల హోరెత్తించారు. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో తెలుగుదేశంకు జరిగిన నష్టాన్ని ఉదహరించారు. ఆస్తులను కోల్పోయిన అనేక మంది నేతలు బహిరంగ వ్యాఖ్యలకు దిగారు. నానిని వద్దనుకుని చంటిని ఎమ్మెల్యేగా గెలుపొందేలా ఏకపక్ష మద్దతు ఇవ్వగా ఇప్పుడు ఆయనను ఎందుకు పార్టీలోకి చేర్చుకోవాల్సి వచ్చిందన్న వాదనను టీడీపీ కేడర్ లేవనెత్తింది. ఈలోపు నాని రాకను అడ్డుకునేందుకు కేడర్ సమాయత్తమై.. టీడీపీలోకి వస్తే ఇక్కడి క్రమశిక్షణకు మీరు తట్టుకోగలరా అంటూ సోషల్ మీడియాలోనే ప్రశ్నల వర్షం కురిపించారు. నాని విషయంలో పార్టీ అధినాయకత్వం సానుకూలంగా ఉంది. ఆయనను తీసుకోవాలని సంకేతాలు అధినాయకత్వం కేడర్‌కు పంపింది. ఎన్నికలకు ముందుగానే నానితో వైసీపీలో ప్రయాణించిన సీనియర్ నేత ఎంఆర్‌డి బలరాం, అప్పట్లో ఈడా చైర్మన్‌గా ఉన్న మధ్యాహ్నపు ఈశ్వరి వైసీపీ నుంచి బయటపడి టీడీపీలో చేరడం ద్వారా నానికి షాక్ ఇచ్చారు. నాని కంటే ముందుగానే ఆయన వ్యవహారశైలిని వ్యతిరేకిస్తూ వచ్చిన ఏలూరు మేయర్ నూర్జహాన్ పెదబాబు దంపతులు టీడీపీలో చేరారు. అప్పట్లో వీరి రాకను టీడీపీ నేతలు వ్యతిరేకించారు. వైసీపీలో ఉంటూ నానా యాగి చేసి ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకున్న వారిని పార్టీలో ఎలా చేర్చుకుంటా రంటూ ఎమ్మెల్యే చంటిపైనా ఒత్తిడి తెచ్చారు. ఏలూరు నియోజకవర్గంలో కార్పొరేషన్ అభివృద్ధి జరగాలన్నా పార్టీ భేదం లేకుండా చూసేందుకు, వీరిని తీసుకోవాల్సి వస్తుందంటూ అప్పట్లో ఎమ్మెల్యే కేడర్‌ను శాంతపరిచారు. తదుపరి నానితో అత్యంత సన్నిహితంగా ఉండే వైసీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఆయన కుమార్తె టీడీపీలో చేరారు. సమాంతరంగా నాని కోటరీలో కీలకంగా ఉండే మంచెం మైబాబు ఇదే బాటలో ప్రయాణించారు. అంటే ఒక్క ఏలూరు నియోజకవర్గంలోనే వైసీపీలో చాన్నాళ్ళపాటు చక్రం తిప్పిన నేత లంతా టీడీపీలో చేరారు. ఇప్పుడు నాని టీడీపీలో చేరుతుండడంతో అనూహ్య పరిస్థితులు నెలకొన్నాయి.

### నాని, చంటి సర్దుకుంటారా ?

వైసీపీలో కీలకంగా వ్యవహరించిన నాని కరోనా తరువాత టీడీపీ నేతలపై ఒకింత పట్టు బిగించారు. తమను కాదని టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న కంప్యూటర్ ప్రసాద్ తోపాటు అనేకమంది నేతలు, కార్యకర్తలపై కేసులు బనాయించడానికి ప్రయత్నించారు. టీడీపీ కార్యకర్తల నిర్మాణాలు ఆక్రమణల్లో ఉన్నాయంటూ వాటిని కూల్చే ప్రయత్నం చేసినట్లు టీడీపీ కేడర్ వాదన. అటు వైసీపీలో ఉండగా స్వపక్షంలో సీనియర్లంతా టీడీపీ వైపు రాగా ఇప్పుడు నాని కూడా అదే రూటులో ప్రయాణించడం, సిట్టింగ్ ఎమ్మెల్యే చంటి ఒకే నియోజకవర్గంలో సర్దుకుపోగలుగుతారా అనే సందేహాలు కేడర్‌లో ఉన్నాయి. వీటన్నిటి మధ్య పార్టీలో చేరబోతున్న సీనియర్ నేత నాని, ఎమ్మెల్యే చంటి మధ్య మంగళవారం స్నేహపూరితంగా సంభాషణ సాగినట్టు సమాచారం.



### పార్టీ నిర్ణయం శిరోధార్యం

**బడేటి చంటి, ఎమ్మెల్యే**

సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని పార్టీలో చేరుతున్నారని, అధినాయకత్వం నిర్ణయమే మా అందరి నిర్ణయం కూడా అని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. నాని రాకను వ్యతిరేకిస్తూ కేడర్ కొంతమేర అసంతృప్తి వ్యక్తం చేసిన మాట నిజమేనని, అయినప్పటికీ పార్టీ నిర్ణయానికే తామూ, కేడర్ కట్టుబడి ఉంటామని మీడియాకు తెలిపారు. ఈ విషయంలో అపోహలు, వివాదాలకు తావేలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన తామంతా క్రమశిక్షణగల సైనికులుగానే వ్యవహరిస్తామని చంటి ప్రకటించారు. ఇదిలా ఉండగా టీడీపీ అధినాయకత్వం కూడా నాని చేరికను ఖరారు చేసిన వైనాన్ని ఎమ్మెల్యే చంటి దృష్టికి తీసుకొచ్చింది. రాజకీయంగా అంతా ఆలోచించే పార్టీ నిర్ణయాలు ఉంటాయనే విషయాన్ని స్పష్టం చేస్తూ ఆళ్ల నాని చేరిక సందర్భంగా మీరు కూడా హాజరుకావాలని ఎమ్మెల్యే చంటికి అధినాయకత్వం ఆహ్వానించింది. ఎలాంటి బేషిజం లేకుండా తాను కూడా హాజరవుతున్నట్టు చంటి బదులిచ్చారు.



కైకలూరులో ఎన్నికైన డీసీ అధ్యక్షులతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

## డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఏకగ్రీవమే

- 14 చోట్ల కూటమి అనుకూలురే గెలుపు
- 21న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీటన్నింటికీ మంగళవారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసినట్టు అధికారికంగా ప్రకటించారు. సాగునీటి సంఘాల మాదిరిగానే డిస్ట్రిబ్యూటరీ కమిటీల్లో కూడా టీడీపీదే పైచేయి అయ్యింది. వైసీపీకి ఏమాత్రం చోటు ఇవ్వకుండా జాగ్రత్తపడ్డారు. అనుకున్నది అనుకున్నట్టుగా ఎక్కడికక్కడ డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు కూడబలుక్కుని ముందుగా నిర్దేశించిన అభ్యర్థులకే మద్దతు పలకడంతో 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. దీంతో సాగునీటి సంఘాల ప్రక్రియలో రెండు విభాగాలకు ఎన్నికలు పూర్తయినట్టయ్యింది. తుది విడతగా తమ్మిలేరు, ఎర్రకాలువ ప్రాజెక్టు కమిటీలకు ఈనెల 21న ఎన్నికలు జరగాల్సి ఉంది. తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ ఎన్నిక చాత్రాయి, ఎర్ర కాలువ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు జంగారెడ్డిగూడెంలో జరుగుతాయని ఎస్ఈ చిలకపాటి దేవప్రకాశ్ ప్రకటించారు.



ర్యాలీలో గౌతు శిరీష, జోగి రమేశ్ మధ్యలో ఉన్న బెజవాడ హర్ష

## అంతా.. ఆ పార్టీ వారే

### నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణతో రచ్చ

- జనసేన పార్టీ జెండాపై మూత్రం పోసిన వైసీపీ నేత హర్ష
- టీడీపీ నాయకులను కేసులతో వేధించిన ఆరేపల్లి మోహనరావు
- గన్నవరం టీడీపీ కార్యాలయాన్ని దహనం చేసిన అనగాని రవి
- చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన జోగి రమేశ్
- టీడీపీ మంత్రి, ఎమ్మెల్యేలతో వేదిక పంచుకున్న నేతలు వీరే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

నూజివీడులో జరిగిన గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం టీడీపీలో పెను తుఫాన్ రేపుతోంది. వైసీపీ హయాంలో టీడీపీ నాయకులను బూతులు తిట్టి.. కేసులతో వేధించి.. టీడీపీ కార్యాలయాలపై దాడులు చేసిన వైసీపీ నేతలకు పెద్ద పీట వేయడమే కాకుండా వారితో కలిసి టీడీపీ నాయకులు ఒకే వేదిక పంచుకోవడం పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలకు కారణమైంది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమం జోగి రమేశ్‌ను టీడీపీలోకి తీసుకొచ్చే ప్రయత్నంగానే ఉందని పలువురు టీడీపీ మద్దతుదారులు సామాజిక మాధ్యమాల్లో దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధికశాతం మంది వైసీపీ నాయకులు కావడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లిన జోగి రమేశ్‌తోపాటు గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసి దహనం చేసిన ఘటనలో కీలక సూత్రధారి వైసీపీ నేత వల్లభనేని వంశీ ముఖ్య అనుచరుడు అనగాని రవి, ఎన్నికలకు ముందు జనసేన జెండాపై మూత్రం పోసి, పవన్ కల్యాణ్‌పై బూతులతో విరుచుకుపడిన ఆగిరిపల్లి మండల వైసీపీ నాయకుడు బెజవాడ హర్ష, నూజివీడు మండలంలో టీడీపీని నామరూపాలు లేకుండా చేస్తానంటూ ప్రగల్భాలు పలికి టీడీపీ నాయకులను దొంగ కేసులతో వేధించిన నూజివీడు వైసీపీ నేత ఆరేపల్లి రాంబాబు ఇలా వేదికపై ఉన్నవారంతా కరుడుగట్టిన వైసీపీ నాయకులే కావడం గమనార్హం. పైగా వేదికపై నుంచి జోగి రమేశ్ ప్రసంగిస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డిని పొగడ్తలతో ముంచెత్తడం టీడీపీ నాయకులను తీవ్ర అసహనానికి గురి చేసింది.

- జనసేన జెండాపై మూత్రం పోసి పవన్ కల్యాణ్‌ను దూషించిన బెజవాడ హర్షపై ఆగిరిపల్లి పోలీసుస్టేషన్‌లో అప్పట్లో జనసేన కార్యకర్తలు కేసు కూడా నమోదు చేశారు.
- గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన ఘటనలో కొద్ది రోజుల క్రితం గన్నవరం ఎంపీపీ, వైసీపీ నేత అనగాని రవిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఆ తర్వాత ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. వైసీపీ హయాంలో వంశీ అండ చూసుకుని టీడీపీ నాయకులను బెదిరించడం దాడులు చేయడం వంటివి ఈయనకు నిత్యకృత్యాలుగా ఉండేవి.
- జోగి రమేశ్ మంత్రి పదవి కోసం ఏకంగా చంద్రబాబు ఇంటిపైనే దాడికి యత్నించారు. చంద్రబాబును లోకేశ్‌ను బూతులు తిట్టని రోజు ఉండేది కాదు.
- ఆరేపల్లి రాంబాబు నూజివీడులో టీడీపీని భూస్థాపితం చేస్తానని పంతం పట్టారు. టీడీపీ నాయకులను కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారు.

ఇలాంటి వైసీపీ నాయకులతో కలిసి టీడీపీ మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ కొనకళ్ల నారాయణ వేదిక పంచుకోవడం టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలకు కారణమవుతోంది. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముందు నూజివీడు వైసీపీ నేత మారగాని నారాయణ ఇంట్లో గౌతు శిరీషతోపాటు కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య జోగి రమేశ్‌తో భేటీ అయ్యారు. జోగి రమేశ్ తనయుడిపై ఉన్న అగ్రి గోల్డ్ కేసు చర్చకు వచ్చినట్లు సమాచారం. కేసుల రగడ నుంచి తనను బయటవేయాలని ఆయన టీడీపీ నేతలను కోరినట్లు సమాచారం. ఆదివారం మధ్యాహ్నం బెజవాడ హర్ష ఇంట్లో నాయకులందరూ భోజనాలు చేశారు. ఆ సందర్భంలో అనగాని రవి తనపై కేసులు పెట్టి జైలుకు పంపారని, తనను బయటపడేయాలని నాయకులను కోరగా, జోగి రమేశ్ జోక్యం చేసుకుని జైలుకు వెళితే నీవు కూడా గౌతు లచ్చన్న అంత గొప్ప నాయకుడివి అవుతావంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై అక్కడున్న నాయకులే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం.

పోలీసులపై దాడి చేసిన

### దొంగ నోట్ల ముఠా అరెస్టు

పోలీసుల అదుపులో 13 మంది నిందితులు 7

హేలాపురి కాలేజీలో యూనివర్సిటీ స్థాయి

### క్రికెట్ పోటీలు ప్రారంభం

పాల్గొంటున్న ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జట్లు 6

# అమ్మా ! వైద్యం ఎలా అందుతోంది..?

## ప్రభుత్వ ఆసుపత్రిలో డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ తనిఖీ

### 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు



పభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ

భీమవరం క్రైం,డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అమ్మా వైద్యం ఎలా అందుతోంది..? సకాలంలో వైద్యం అందిస్తున్నారా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ మంగళవారం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో నరకం చూస్తున్నాం కథనానికి ఆయన స్పందించి ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి పనులకు నిధులు విడుదలయ్యాయని వాటితో మరమ్మతులు చేయించుకోవాలని ఆసుపత్రి అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన తల్లిపాల బ్యాంకును ఈనెల 20వ తేదీన ప్రారంభిస్తామని తెలిపారు. సుషేణ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లిపాల బ్యాంకును ఏర్పాటు చేశామన్నారు. బిడ్డకు సరిపడా పాలు ఇవ్వగా మిగిలిన పాలను సేకరించి అవసరమైన పిల్లలకు అందించేందుకు తల్లిపాల బ్యాంకు ఉపయోగపడుతుందన్నారు. ఆసుపత్రుల్లో వైద్యుల ఖాళీలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీ కళ్యాణి, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## నేత్రపర్వం..ధనుర్మాస ఉత్సవం



క్షేత్ర పురవీథుల్లో గోదాదేవితో కలసి ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు.

ద్వారకాతిరుమల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ధనుర్మాస ఉత్సవం క్షేత్రం పుర వీధుల్లో అట్టహాసంగా జరిగింది. భాగంగా స్వామివారు, ఉభయదేవేరులు, గోదాదేవితో కలసి క్షేత్రపురవీథుల్లో అట్టహాసంగా ఊరేగారు. ముందుగా మంగళవారం ఉదయం ఆలయ ఆవరణలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లుతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం గజ, అశ్వ సేవలతో పాటు మేళ తాళాల నడుమ పురవీథుల్లో ఊరేగించారు. అనంతరం ధనుర్మాస మండపంలో గోదాదేవితో సహా శ్రీవారి, అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చారు

## మద్ది ఆంజనేయస్వామికి దర్శకుడు వంశీ పూజలు



స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది అంజనేయస్వామిని ప్రముఖ దర్శకుడు వంశీ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకుడు జవ్వాది కృష్ణ దర్శకుడు వంశీని దుశ్శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయానికి మంగళవారం వివిధ సేవల రూపంలో రూ.లక్షా 18 వేల 100 ఆదాయం వచ్చినట్లు ఈవో చందన తెలిపారు.





పోటీలు ప్రారంభిస్తున్న నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి .. పాల్గొన్న క్రీడాకారులు

## క్రీడల వల్ల మనో ధైర్యం పెరుగుతుంది

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల శారీరక ఉల్లాసంతో పాటు మానసిక ఉత్తేజం పెరుగుతుందని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకరరెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం అంతా చదువుకే పరిమితం కాకుండా ఆట విడుపులా ఇలాంటి స్పోర్ట్స్ మీట్ పెట్టడం వల్ల క్రీడా స్ఫూర్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ ఫణీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 3 రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా లోని 11 కళాశాలల నుంచి 473 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టేబుల్ టెన్నిస్, చెస్ తదితర క్రీడలు 3 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. మంగళవారం వివిధ పోటీలు ఉత్సాహంగా సాగాయి.

## హేలాపురి కాలేజీలో క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లావణ్య

దెందులూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి), తూర్పు, పశ్చిమ, కృష్ణా, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల పరిధిలో యునివర్శిటీ స్థాయి క్రికెట్ పోటీలు హేలాపూరి కాలేజీలో ప్రారంభమయ్యాయి. దెందులూరు మండలంలో గోపన్నపాలెం శివారువేగవరంలోని హేలాపూరి టెక్నాలజీ అండ్ సైన్సు ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో ఈనెల 21 తేదీ వరకూ బాలుర విభాగంలో యూనివర్శిటీ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారు మంగళవారం వేగవరం హేలాపూరి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ లావణ్య ప్రారంభించారు. జేఎన్‌టీయూ పరిధిలోని 65 టీమ్‌లతో కాలేజీ క్రీడా మైదానంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు కాలేజీ ఏవో కరుణానిధి తెలిపారు

## స్వర్ణాంధ్రలో ముగిసిన జేఎన్‌టీయూ ఫుట్‌బాల్ పోటీలు



విజేతలకు షీల్డ్ అందిస్తున్న ఆర్డీవో దాసిరాజు

నరసాపురం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాంధ్ర కాలేజీలో గత రెండు రోజులుగా జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజీల ఫుట్‌బాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. విన్నర్‌గా భీమవరం విష్ణు కాలేజీ టీమ్, రన్నర్‌గా రాజమండ్రి గైట్ కాలేజీ, మూడో స్థానంలో కాకినాడ ఆదిత్య, నాల్గో స్థానంలో సీఆర్‌రెడ్డి ఏలూరు కాలేజీలు నిలిచాయి. విజేతలకు ఆర్డీవో దాసిరాజు, కళా శాల చైర్మన్ కె.సత్యనారాయణ, కోశాధికారి త్రినాద్, డైరెక్టర్ శ్రీహరిలు షీల్డ్ అందించారు. ఆర్డీవో మాట్లాడుతూ దేశానికి పేరు తెచ్చే విధంగా నేటి యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం సాధిస్తే మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.పోటీలకు 17 కాలేజీలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, పీడీ కొండ తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లు చిత్రకారులకు జాతీయస్థాయిలో ప్రతిభ



పాలకొల్లు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చిత్రకారులు గొన్నాబత్తుల సత్యనారాయణ (జీఎస్‌ఎన్), కడలి శ్రీనివాస్, నక్కా వెంకటేశ్వర రావులకు జాతీయ స్థాయిలో చిత్రలేఖనం పోటీల్లో బహుమతులు లభించాయి. శ్రీ దర్శిణి కళైక్కూడమ్బు (చెన్నై) 20వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించినట్టు వారు మంగళవారం విలేకర్లకు తెలిపారు. కళాకారులు ముగ్గురిని పట్టణ ప్రముఖులు అభినందించారు

## అనారోగ్యంతో దేవస్థానం అశ్వం మృతి



ద్వారకాతిరుమల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా ద్వారకా తిరుమల చినవెంకన్నకు సేవలందించిన ఓ అశ్వం తీవ్ర అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. దీనిని శ్రీనివాస అని పిలుస్తారు. దీని వయసు సుమారు 20 ఏళ్లని చెబుతున్నారు. ఆలయ అశ్వశాలలో స్వామివారి సేవల నిమిత్తం రెండు అశ్వాలున్నాయి. అందులో ఓ అశ్వం కొద్దిరోజులుగా అనారోగ్యం బారిన పడింది. దీనికి వైద్యసేవలందించినా అది కోలుకోలేక పోయింది. దీంతో మంగళవారం ఉదయం కన్నుమూసింది.

జమిలి ఎన్నికలకు సంబంధించి సవరణ బిల్లు మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.. వన్ నేషన్..వన్ ఎలక్షన్ బిల్లుకు కాంగ్రెస్‌తో పాటు విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో రూపొందించినదే ఈ బిల్లు.. దేశంలో ఎప్పుడూ ఏదో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉంటున్నాయి.. దీనికోసం పెద్ద మొత్తంలో ప్రజాధనం వృథా అవుతోంది.. అంతేకాకుండా ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు, సిబ్బంది, పోలీసులు, కేంద్ర బలగాలను పెద్దసంఖ్యలో ఏర్పాటు చేయాల్సి వస్తోంది.. ఎన్నికల కోడ్ కారణంగా సంక్షేమ పథకాల అమలుకు విఘాతం కలుగుతోంది.. ప్రతీ ఏడాది ఎక్కడో చోట ఎన్నికల తంతు పెద్ద ప్రహసనంగా మారుతోంది.. అందుకే దేశమంతా ఒకేసారి పార్లమెంటు స్థానాలకు, రాష్ట్రాల్లోని అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలనే దానిపై బిల్లు ప్రవేశ పెట్టారు.. దీనిపై వివిధ వర్గాల ప్రముఖులను ఆంధ్రజ్యోతి పలకరించగా తమ అభిప్రాయాలను వెల్లడించారు..

-భీమవరం అర్బన్/ దెందులూరు / చాట్రాయి/ ముదినేపల్లి/ పెనుగొండ/అత్తిలి




# జమిలికి అటూ..ఇటూ

**• ఎంతమాత్రం ప్రయోజనం కాదు..**



జమిలి ఎన్నికలు ఎంత మాత్రం ప్రయోజనం కాదు.. దేశ ఫెడరల్ ప్రాజాస్వామిక స్ఫూర్తిని, రాష్ట్రాల హక్కులను దెబ్బ తీస్తాయి. ఒక రాష్ట్రంలో అనుకోని పరిస్థితుల్లో ప్రభుత్వం పడిపోతే తిరిగి ఎన్నికలు వచ్చేవరకు గవర్నరు పాలనకు కేంద్రం నెడుతుంది తప్ప ఎన్నికలుండవు. ఒకేసారి ఎన్నికల వల్ల ఖర్చు పెరుగుతుంది.. సమస్యాత్మక ప్రాంతాలకు బలగాల మోహరింపునకు అవకాశం ఉండదు. ఇప్పటివరకు అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రాల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులు పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇక ముందు అలా ఉండదు.

**- బి.బలరాం,సీపీఎం జిల్లా కార్యదర్శి**

**• ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం**



జమిలి ఎన్నికలు రాష్ట్రాల హక్కులను హరిస్తాయి. ప్రధాని మోదీ అధ్యక్ష తరహా పాలనకు శ్రీకారం చుట్టటానికే జమిలిని తెర పైకి తెచ్చారు. మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రాంతీయ పార్టీలను ఉనికి లేకుండా చేయటానికి ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే జమిలికి రూపకల్పన చేశారు. ఇండియా కూటమి జమిలి ఎన్నికలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నది. ఈ బిల్లు అమలులోకి వస్తే జీఎస్టీ ద్వారా రాష్ట్రాల ఆదాయాన్ని కేంద్రం లాగేసుకున్నట్లే రాష్ట్రాల హక్కులనూ హరిస్తుంది.దీన్ని గట్టిగా వ్యతిరేకించాలని అన్ని ప్రాంతీయ పార్టీలకు, ప్రజలకు, ప్రజాస్వామ్య వాదులకు విజ్ఞప్తి చేస్తున్నాను

**- డి.హరనాథ్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు**

**• ప్రజాస్వామ్యానికి విరుద్ధం**



జమిలి ఎన్నికల వల్ల అధ్యక్ష తరహా పాలనకు దారి తీస్తాయి. రాజ్యాంగ మౌలిక స్వరూపాలకు ఇది విరుద్ధం. కేంద్రం వెంటనే జమిలి ఎన్నికల బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలి..ఇది ప్రజా స్వామ్యానికి మంచిది కాదు.

**-ఆలపాటి నరసింహమూర్తి, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ కన్వీనర్ , దెందులూరు**

**• రాష్ట్రాల ఉనికికి ప్రమాదం**



జమిలి ఎన్నికల వల్ల రాష్ట్రాలకు ఉండే హక్కులను కోల్పోయే ప్రమాదం ఉంది. కేంద్రం తనకు ఇష్టం లేని రాష్ట్రంపై తమకు అనుకూలంగా లేకపోతే ఇబ్బందులు పెట్టే అవకాశం ఉంటుంది. మరో సారి పెద్దలు ఆలోచించాలి. జమిలి వల్ల అంత ప్రయోజనం ఉండకపోవచ్చు.

**- సంపంగి వేణుగోపాల తిలక్, మానవత అధ్యక్షుడు, దెందులూరు**

**పబ్లిక్ పల్స్**

## దేశమంతా ఒకేసారి ఎన్నికలు సాధ్యమేనా ?



**• పునరాలోచించాలి**



జమిలి ఎన్నికల బిల్లు ఆమోదం అవుతుందని నేను అనుకోవడం లేదు. ఈ బిల్లుకు మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలి.. అది సాధ్యం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు అంటే చాలా కష్టంతో కూడుకున్న విషయం. జమిలి ఎన్నికలపై కేంద్రం పునరాలోచన చేయాలి.

**- లంకా కృష్ణమూర్తి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

**• ఒకేసారి ఎన్నికలు మంచిదే**



ప్రజాస్వామ్య వ్యవస్థలో దేశంలోని అన్నివర్గాల నుంచి ఒకేసారి ప్రజాభిప్రాయంతో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు నిర్వహించడం సుస్థిరమైన ప్రభుత్వాల ఏర్పాటుకు దోహదం చేస్తుంది. లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిగితే ఐదేళ్ల వరకు పాలకులు అభివృద్ధి పైనే దృష్టి పెట్టవచ్చు. అయితే అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసు కోగలమా లేదా అన్నది ఆలోచించాలి.

**- సాగి సుబ్బరాజు, రాజానగరం, ముదినేపల్లి మండలం**

**• మన దేశానికి అవసరం**



అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారత దేశానికి జమిలి ఎన్నికలు చాలా అవసరం. నెల రోజుల్లో దేశవ్యాప్తంగా రోజుకో రాష్ట్రం చొప్పున పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికలు జరిపించవచ్చు. టెక్నాలజీ లేని సమయంలోనే 1967 వరకు దేశంలో జమిలి ఎన్నికలు జరిగాయి. ఇపుడు టెక్నాలజీ పెరిగింది. జమిలి ఎన్నికలు నిర్వహించడం పెద్ద కష్టమైన పని కాదు. ఇప్పటికే అనేక సార్లు రాజ్యాంగాన్ని సవరించుకున్నాం. జమిలి ఎన్నికలు కోసం రాజ్యాంగాన్ని మరొసారి సవరించుకోవడం తప్పేమీ కాదు.

**-మల్లుల లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ, పెనుగొండ**

**• స్థిరమైన పాలన**



జమిలి ఎన్నికలతో దేశం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఎప్పుడూ దేశంలో ఏదో మూల ఎన్నికలు జరగడం వలన పాలనలపై పాలకులు, అధికార యంత్రాంగం సరిగా దృష్టి సారించలేకపోతున్నారు. తరుచూ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వలన అభి వృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకి అవుతున్నది. దీనికి తోడు అనవసర ఖర్చు,పాలనలో స్థిరత్వం ఉండటం లేదు. జమిలి ఎన్నికల వలన స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడతాయి.

**-మోరంపూడి శ్రీనివాసరావు, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి, చాట్రాయి మండలం**

**• రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది**



ఒకేసారి ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలు జరగడం వల్ల మిగిలిన సమయాల్లో అభివృద్ధిపై దృష్టి పెట్టవచ్చు. ఎన్నికల కోడ్‌తో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల వల్ల విద్యార్థులు చదువులో సైతం వెనుకబడుతున్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే చాలా ఉపయోగం ఉంటుంది

**- కమ్మ శివరామకృష్ణ, సమాచార హక్కు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, దెందులూరు**

**• జమిలి ఎన్నికలు సాధ్యమే**



జెమిలి ఎన్నికలు దేశానికి అవసరం. టెక్నాలజీ పెరగడంతో పాటు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఒకే సారి ఎన్నికలు చేపడితే దేశం అభివృద్ధిలో ముందుకు పోతుంది. ఒకేసారి ఎన్నికలు చేపడితే అస్తమానం ఎన్నికలు ఉత్పన్నం కావు.

**-దిరిశాల మునేశ్వరరావు, సంఘ సేవకుడు, అత్తిలి**

## పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి నిమ్మల రామానాయుడు

### ఐదు గ్రామాల్లో రూ.1.38 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



శిరగాలపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

యలమంచిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం, అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండు కళ్లు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. యలమంచిలి మండలం నేరేడుమిల్లి, పెనుమద్రు, కట్టుపాలెం, గుంపర్రు, శిరగాలపల్లి గ్రామాల్లో రూ.1.38 కోట్ల నిధులతో సీసీ రహదారులు, డ్రైన్‌లు, పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణపనులకు రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మంగళవారం భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు.మంత్రి మాట్లాడుతూ పట్టణాలకు ధీటుగా పల్లెసీమలను అభివృద్ధి చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎట్టిపరిస్థితుల్లోనూ 2026 అక్టోబరు నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా, జూలై నాటికి పూర్తిచేయాలని ఇంజనీరింగ్ బృందానికి సూచించామన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల జీవనాడి అని, కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్ది రాష్ట్రానికి ఆదాయాన్ని పెంచేదిశగా ఎన్డీఏ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు.దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ పనుల స్థానంలో కొత్త డయాఫ్రమ్ వాల్ పనులను జనవరి 2వ తేదీన చేపట్టనున్నామని, అందుకు అవసరమైన యంత్రసామాగ్రిని ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రభుత్వం ద్వారా తెలుగుజాతికి, భావితరాలకు మంచి భవిష్యత్తు అందిస్తామన్నారు. ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. సర్పంచులు పైడి చంద్రపాల్, తుంగ అమూల్య, పెనుమత్స వాణి, పి.నాగరాజు, కూటమి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, కడలి గోపి, చిలుకూరి బాలాజీ, చిట్టూరి ఆంజనేయులు, నడింపల్లి నరేష్‌కుమార్‌రాజు, నాగప్రసాద్, తాళ్ల నాగరాజు, కొడవటి వరబాబు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


## దాళ్వా దూకుడు











రైతులు దాళ్వా పనుల్లో బిజీ అయిపోయారు.. నాట్లు వేసేందుకు దుక్కి దున్నిన చేలు అద్దంలా మెరుస్తున్నాయి.. ఉండి , గణపవరం ప్రాంతాల్లో ఒకపక్క దుక్కి దున్నుతుండగా మరో పక్క నాట్లు వేస్తున్నారు.. పనులు చేపట్టని చేలో పక్షులు తమ కడుపు నింపుకునే పనిలో పడ్డాయి..

- ఫొటోగ్రాఫర్, భీమవరం



## మోడరన్ హరిదాసు

సంక్రాంతి సీజన్ మొదలు కావడంతో గ్రామాల్లో మోడరన్ హరిదాసులు సందడి చేస్తున్నారు. గతంలో హరిదాసులు బిక్ష పాత్ర నెత్తిపెట్టుకొని హరి కీర్తనలు పాడుకుంటూ వీధుల్లో తిరిగేవారు. కొన్నేళ్లుగా హరిదాసులు స్టయిల్ మార్చారు. మోపెడ్‌పై బిక్ష పాత్ర బిగించి, టేప్, రికార్డర్‌లో భక్తి పాటలు పెట్టుకొని ఇంటింటికి వస్తున్నారు. చూస్తుండగానే ఎంత మార్పు వచ్చింది అని వృద్ధులు ఆశ్చర్యపోతున్నారు. కళలు, సంస్కృతులు ఆచారాలలో కాలానుగుణంగా ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో మోడరన్ హరిదాసులు కూడ ఒకటి. సంక్రాంతి పండుగ అంటే గ్రామీణ ప్రజలకు ప్రత్యేకమైనది. ఈ మాసంలో ధనిక పేద తేడా లేకుండా ఇంటి ముందుకు యాచకులు ఎవరు వచ్చినా లేదనకుండా దానం చేస్తుంటారు. రైతులకు కొత్త ధాన్యం ఇంటికి రావడం, కూలీలకు కూడా దండిగా పనులు దొరకటం వలన సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో అడంబరంగా జరుపుకోవడం ఆనవాయితీ. - చాట్రాయి

## నేడు రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 17 : పాలకొల్లులో బుధవారం రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు అంతర్జాతీయ చిత్రకారుడు మార్లపూడి ఉదయ్ కుమార్ తెలిపారు. తన తండ్రి డ్రాయింగ్ టీచర్ ఇజ్రాయిల్ శత జయంతి పురస్కరించుకుని 27వ వార్డులోని ఎల్ఆర్‌పేట 5వ వీధిలో తన నివాసం వద్ద విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయి కళాకారులు చిత్రీకరించిన చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

## ప్రశ్న పత్రాల తరలింపుపై హెచ్ఎంల హైరానా



డీఈఓ వెంకటలక్ష్మమ్మకు వినతి పత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా నాయకులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఏ-1 పరీక్షల ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్ల నుంచి ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రతీరోజూవెళ్ళి తెచ్చుకుని పరీక్షను నిర్వహించాలన్న నిర్ణయాన్ని సమీక్షించి మార్పులు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, సుబ్బారావు డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిర్ణయంవల్ల 15 నుంచి 20 కిలోమీటర్ల దూరానికిపైగా రాకపోకలు సాగించాల్సిన హెచ్ఎంలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖాధికారులే సీఎంఆర్టీల ద్వారా తగిన సెక్యూరిటీతో పాఠశాలలకు పరీక్ష పేపర్లు చేర్చేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ప్రశ్నపత్రాలు లీక్‌చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### టీచర్లకూ ప్రశ్నపత్రాలు ఇవ్వండి : డీసీఈబీ

సోమవారం జరగాల్సిన ఎస్ఏ-1 పరీక్షల గణితం ప్రశ్నపత్రం కోనసీమ, వైజాగ్, గుంటూరు జిల్లాల నుంచి లీకై యూట్యూబ్‌లో ప్రత్యక్షమైనట్టు ఆరోపణలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆ పరీక్షను వాయిదావేసి, తిరిగి ఈ నెల 20న నిర్వహించడానికి నిర్ణయించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే చర్యల్లో భాగంగానే వాటిని పోలీసు స్టేషన్లలో భద్రపరిచి, పరీక్ష జరిగేరోజున స్కూలు హెచ్ఎంలు స్వయంగా హాజరై తీసుకెళ్ళాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో మండలానికి ఒకటి చొప్పున ఉండే పోలీసు స్టేషన్‌కు దాని పరిధిలోవున్న 6నుంచి 8 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రశ్నపత్రాలను తీసుకెళ్ళేందుకు రాకపోకలు సాగించాల్సిరావడం ఒకింత కష్టమేనని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. మరో మూడు పరీక్షలు మాత్రమే మిగిలివున్న నేపథ్యంలో ఎస్ఏ-1 ప్రశ్నపత్రాలను తీసుకెళ్ళేందుకు పోలీసుస్టేషన్‌కు సంబంధిత స్కూలు హెచ్ఎం రాకపోయినా, ఆయన అధీకృత లేఖతో పోలీసుస్టేషన్‌కు స్కూలు టీచరు ఎవరు వచ్చినా ఇవ్వాలని జిల్లా కామన్ పరీక్షల మండలి (డీసీఈబీ) మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇకమీదట నిర్వహించే ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాలన్నీ ఆయా జిల్లాలను యూనిట్‌గా తీసుకుని స్థానికంగానే (రాష్ట్రమంతటా ఒకే ప్రశ్నపత్రంబదులుగా జిల్లాస్థాయిలో) క్వశ్చన్ పేపర్ రూపకల్పన, ముద్రణ, పంపిణీ బాధ్యతలను అప్పగిస్తే లీకేజీలను సమర్థవంతంగా అరికట్టవచ్చునని డీసీఈబీ నుంచి రాష్ట్రప్రభుత్వానికి చేసిన సూచనలు, ప్రతిపాదనలపై ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. ఈ ప్రత్యామ్నాయ సూచనలపై అధికారికంగా ఎటువంటి ప్రకటన లేదు.

### మార్పుచేర్పులకు వెసులుబాటు

వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బాలబాలికల వివరాలను ఇటీవల అపార్‌లో నమోదుచేసిన డేటామేరకు మార్పుచేర్పులు చేసుకునేందుకు ఈ నెల 19నుంచి 23వ తేదీ వరకు వెసులుబాటు కల్పించినట్టు డీఈవో వెంకటలక్ష్మి తెలిపారు. స్కూలు హెచ్ఎంలు పాఠశాలల లాగిన్‌లద్వారా విద్యార్థుల వివరాల మార్పునకు అవకాశం ఉంటుందన్నారు.

## పింఛన్ గత సేవలకు ప్రతిఫలం

**పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సహకరిస్తా: ఎమ్మెల్సీ గోపీమూర్తి**




సమావేశంలో మాట్లాడుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల హక్కులు, డిమాండ్ల సాధన కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డుఎంప్లాయిస్ అసోసియేషన్ భీమవరం యూనిట్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎస్ పాల్ అధ్యక్షతన జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెన్షన్ అనేది ఉద్యోగి ప్రాథమిక హక్కు అని ఎవరి దయా భిక్ష కాదని, పెన్షన్ గత సేవలకు ప్రతిఫలం మాత్రమేనని అన్నారు. పెన్షన్ రద్దుచేసే అధికారం ఏ ప్రభుత్వానికి లేదు అని పేర్కొన్నారు. ఉప ఖజానా అధికారి అల్లూరి రవివర్మ మాట్లాడుతూ పెన్షనర్లకు ఏ సమస్య వచ్చినా తనవద్దకు నేరుగా రావచ్చని ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి. జేమ్స్, కార్యదర్శి ఎస్ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ 70,75 సంవత్సరాలకు ఇచ్చే అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ గత ప్రభుత్వం తగ్గించిందని దానిని పునరుద్ధరించవలసిన అవసరం ఉందని, పెండింగ్ డీఏలు వెంటనే మంజూరు చేయాలని పేర్కొన్నారు. అనంతరం 9 మంది సూపర్ సీనియర్ పెన్షనర్స్ దండు తమ్మిరాజు, సూర్యనారాయణరాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, మంతెన సత్యనారాయణ రాజు, విప్పర్తి అన్నపూర్ణమ్మ, ఓ.మోజెస్, ఈ.నాగముని, ఎ.విశ్వనాథం, రాజులను సన్మానించారు. యూనిట్ కార్యదర్శి సీతారామరాజు, కోశాధికారి సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు, గౌరవ అధ్యక్షుడు పట్టాభి రామయ్య, పెన్షనర్స్ జిల్లా కోశాధికారి రవిప్రసాద్ పాల్గొన్నారు

## జీఎస్టీ చట్టంలో మార్పులపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ పిజగదీష్ బాబు

భీమవరంటౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ చట్టంలో వచ్చే మార్పులపై వ్యాపారస్తులు, అకౌంటెంట్లు, పన్ను చెల్లింపుదారులు అవగాహన చేసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.జగదీష్ బాబు అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం నూతన జీఎస్టీ చట్టంలో వచ్చిన మార్పులకు సంబంధించి డీలర్లు, వ్యాపారులు, అకౌంటెంట్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ చెల్లించే వ్యాపారస్తులు వ్యాపారం కోసం తీసుకున్న షాపుకు సంబంధించి అద్దె చెల్లించే యజమాని జీఎస్టీ పరిధిలో లేకపోతే సంబంధిత యజమాని నుంచి వ్యాపారవేత్త 18 శాతం జీఎస్టీగా వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిఉంటుందని అన్నారు. అదే విధంగా సంబంధిత యజమాని జీఎస్టీ పరిధిలో ఉండి ఉంటే అతడికి ఎటు వంటి టాక్స్ అడిగి కట్టవలసిన అవసరంలేదని స్పష్టం చేశారు. యజమానే జీఎస్టీ చెల్లించుకుంటారని ఆయన వివరించారు. అదేవిధంగా స్క్రాప్ వ్యాపారం చేసే వ్యాపారస్తులు కూడా 2లక్షల 50వేల రూపాయలు విలువ కలిగిన స్క్రాప్‌ను జీఎస్టీలేని వ్యాపారి అమ్మితే కొనుగోలు చేసిన వ్యాపారి జీఎస్టీ చెల్లిస్తే అమ్మిన వ్యాపారి నుంచి 18శాతం జీఎస్టీని వసూలు చేసి కట్టవలసి ఉంటుందని ఆయన తెలిపారు. సమావేశం అధికారులు పి.రాజేష్ కుమార్, ఎం.గంగాధరరావు, డి.శ్రీనివాసరావు, ఛాంబర్ అధ్యక్షుడు బొండాడ రామోహన్‌రావు(రాంపండు), సంగిడి బుజ్జి, కాగిత వెంకటరమణ, ఏపీటీపీఈఏ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉద్యోగులతో జడ్పీ చైర్‌పర్సన్ సమీక్ష



ఏలూరుసిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఉద్యోగులు, అధికారులతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మంగళవారం జడ్పీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సెక్షన్లు వారీగా ఈ సమీక్షా కార్యక్రమం ఆమె నిర్వహించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ ఆర్ విజయరాజు, డిప్యూటి సిఈఓ కె భీమేశ్వర్ , ఏఓలు పాల్గొన్నారు.



# చినుకు.. వణుకు!

### ఆక్వా ఉక్కిరిబిక్కిరి



ఆకివీడు రూరల్ డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన అకస్మాత్తు మార్పుతో ఆక్వా ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. చల్లని వాతావరణానికి చెరువులలో నీరు మరింత చల్లబడి డివో పడిపోతుందని, రొయ్యలలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని, వైరస్‌ల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు మేత తీసుకోవడం తగ్గించేస్తాయని తెలిపారు. ఏరియేటర్లతో ఆక్వాను బ్రతికించుకునే చర్యలు రైతులు తీసుకున్నారు.

- మారిన వాతావరణంతో రైతుల్లో ఆందోళన
- అల్పపీడన ప్రభావంతో కమ్ముకున్న మబ్బులు
- అక్కడక్కడా తేలికపాటి వర్షాలు
- హడావుడిగా ధాన్యాన్ని ఇళ్లకు చేరుస్తున్న రైతులు
- కొన్నిచోట్ల ధాన్యాన్ని ఒబ్బిడి చేసి బరకాలు కప్పుతున్న వైనం





పోలవరం, ఆచంటలలో రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపిన రైతులు..

ఏలూరు సిటీ/పోలవరం/ఆకివీడు రూరల్/ఆచంట/ఉండి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. మంగళవారం వర్షాబావ పరిస్థితులు కనబడడంతో రైతులు పంటలు రక్షించుకునే పనిలో పడ్డారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని హడావుడిగా ఇళ్లకు తరలిస్తున్నారు. పోలవరం మండలంలో ఇప్పటికే కోతలు కోసి నూర్చిన పంటలు పట్టిసీమ ఎత్తిపోతల పథకం, పట్టిసీమ ఎత్తిపోతల పథకం డెలివరీ ఛానల్, పట్టిసీమ శివక్షేత్రం ఫెర్రీ పాయింట్ ఆవరణ లోను, గూటాల, కొత్తపట్టిసీమ వీధుల్లో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం, కళ్ళాల్లో ధాన్యాన్ని ఒబ్బిడి చేసి బరకాలు కప్పే పనిలో పడ్డారు. మరి కొందరు బస్తాలకెత్తి ధాన్యం దాచుకునే గోదాములు లేక వచ్చిన ధరలకు దళారులకు అమ్ముకుంటున్నారు. ఆకివీడు మండలంలో మంగళవారం ఉదయం నుంచి మేఘావృతమై చలిగాలి ఎక్కువగా ఉండటం, సాయంత్రం సమయంలో చిరు జల్లులు పడుతుండటంతో మాసూలు అయిన రైతులు ఆందోళనలో పడ్డారు. ఆలస్యంగా పంటలు రావడం, తేమ శాతం తగ్గించుకునేందుకు ధాన్యం రాశులుగా పోసి ఆరబెడుతున్నారు. అకస్మాత్తు మార్పుతో రైతులు రాశులపై బరకాలు కప్పి భద్రపరుచుకుంటున్నారు. సిద్ధాపురం ప్రాంతంలో రైతులు ఎక్కువగా రాశులపై ధాన్యాన్ని పోగు పెట్టి ఉంచారు. ఆచంట మండలంలో సార్వా మాసూళ్ళు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే రాత్రి, పగలు వరి యంత్రాలు ద్వారా రైతులు మాసూళ్ళు చేస్తున్నారు. మాసూళ్ళు అయిన ధాన్యం అనేక చోట్ల కల్లాలు, రోడ్లపైన ఉంది. మబ్బులు, మేఘాలతో తమ ధాన్యాన్ని తూకం తూసి మిల్లులకు పంపే పనుల్లో హడావుడిగా ఉన్నారు. సార్వా సాగులో మాసూళ్ల పర్వం చివరి దశకు చేరింది. ఏలూరు జిల్లాలో సాగు చేసిన పంట పొలాల్లో ముమ్మరంగా వరి మాసూళ్ళ కార్యక్రమం జరుగుతోంది. ఈ దశలో వర్షాలు కురిస్తే పంట మొత్తం నాశనం అయిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ద్రోణి కారణంగా రాబోయే రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయటంతో రైతులలో ఆందోళన మొదలైంది. దీనికి తగ్గట్టుగానే సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. ఏలూరు జిల్లాలో 1.91 లక్షల ఎకరాల్లో సార్వా వరి సాగు చేయటం జరిగింది. వరి కోతలు 1.49 లక్షల ఎకరాల్లో పూర్తయింది. ఉండి, వెలివర్రు, చిలుకూరు, యండగండి, ఉప్పులూరు తదితర గ్రామాలలో అకాల వర్షంతో రైతులు అవస్థలు పడ్డారు. ఉండి గ్రామంలో ఇంకా పలుచోట్ల మాసూళ్లు పూర్తి కాలేదు. యండగండి, ఉప్పులూరులలో పట్టుబడులు పట్టి రహదారులపై ఉంచారు. వీటిపై తడవకుండా బరకాలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు.

### ధాన్యం భద్రతకు ముందస్తు చర్యలు: జేసీ

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కోతలు కాబడి కళ్ళాల్లో ఉన్న ధాన్యం రక్షణకు ఇప్పటికే 2వేల టార్పాలిన్‌లు రైతులకు పంపిణీ చేశామని, మరో 500 టార్పాలిన్ లు ముందస్తుగా సిద్ధం చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి తెలిపారు. వర్షాలకు ధాన్యం తడవకుండా కప్పేందుకు ఇంకా అవసరమైన టార్పాలిన్స్ కొనుగోలు చేసి అందిస్తామన్నారు. రైతులు తమ సమస్యలను 18004256453 లేదా 08812-230448, 7702003584 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేసినట్లయితే అధికారులు తగు పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు.

## దాళ్వా నారుమడులకు గండం

**పశ్చిమలో 1500 ఎకరాల్లో నారుమడులు పూర్తి**

భీమవరం రూరల్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): దాళ్వా నారుమడులకు వాతావరణ మార్పులు గండంగా మారుతున్నది. వారం రోజుల క్రితం అల్పపీడన ప్రభావంతో దాళ్వా నారుమడులకు ఆదిలోనే కొంత వరకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇంతలో అల్పపీడనం నుంచి గట్టెక్కాములే, నారుమడులు బతికాయి మిగిలిన నారుమడులు వేసుకోవచ్చన్న రైతులకు మరో అల్పపీడనం కంగారు పడేలా చేస్తున్నది. మంగళవారం అల్పపీడన ప్రభావంతో మబ్బులు, చిన్నపాటి చినుకులు పడ్డాయి. దీంతో రైతులు వాతావరణం సార్వా నారుమడులు మాదిరిగా దాళ్వా నారుమడులు నష్టం చేకూరుస్తాయన్న ఆందోళనలో ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లా లో దాళ్వా పంట 2 లక్షల 25 వేల ఎకరాల్లో సాగనుంది. దానికి సంబంధించి పది వేల ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 1500 ఎకరాల్లో మాత్రమే నారుమడులు వేసినట్లు వ్యవసాయాధికారులు లెక్క చెబుతున్నారు. ఇంకా 8 వేల 500 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉంది. అన్నిచోట్ల నారుమడులు విత్తన చల్లిక కోసం ఏర్పాట్లు చేశారు. ఈ రెండు మూడు రోజుల్లోనే చాలా వరకు నారుమడులు వేయడం జరుగుతుంది. ఈ సమయంలో వర్షాలు పడితే నారుమడుల్లో నీటిని బయటకు తోడటంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. నారుమడులు కూడా దెబ్బతీనే అవకాశం ఉంది. దీంతో రైతులకు అప్పపీడనం భయంగా మారింది.

## 20న మున్సిపల్ టీచర్ల పదోన్నతులకు కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు నగర పాలక సంస్థ, మరో ఏడు పురపాలక సంఘాల యాజమాన్య పాఠశాలల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయుల పదోన్నతులకు తుది సీనియార్టీ జాబితాలను డీఈవో ఏలూరు వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ జాబితాల్లోవున్న ఉపాధ్యాయులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నిమిత్తం సంబంధిత సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తోసహా ఈ నెల 20న ఉదయం 9గంటల్లోగా ఏలూరులోని డీఈవో కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. పదోన్నతుల కౌన్సెలింగ్ అదేరోజు మధ్యాహ్నం నిర్వహిస్తామన్నారు. కాగా ఏలూరు కార్పొరేషన్ పాఠశాలల్లో రెండు హెచ్ఎం, 12 స్కూల్ అసిస్టెంట్ కేడర్‌పోస్టులను, జిల్లాలోని మిగతా ఏడు మునిసిపాలిటీల్లో 4 హెచ్ఎం, 30 స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులను పదోన్నతిపై భర్తీచేసే అవకాశం ఉంది.

## నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం



పాలకొల్లు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకం నిర్వహణకు గానూ దాతలు రూ.1.01.116 చెక్కును విరాళాన్ని ఈవో శ్రీనివాసరావుకు అందజేశారు. మంగళవారం నెలమూరుకు చెందిన మేడిది వరలక్ష్మీ జ్ఞాపకార్థం బంధువులు కె.జయ వెంకట రామారావు విరాళాన్ని అందజేశారు.

### క్రైమ్ కార్నర్

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :మద్యానికి బానిసైన ఒక వ్యక్తి మద్యం మత్తులో పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్ళలంక గ్రామానికి చెందిన గోవిందు సీతారామాంజనేయులు (38)కి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిస అయ్యాడు. ఏ పని చేయకుండా అతిగా మద్యం తాగుతూ ఇంట్లో భార్య, పిల్లల్ని తిడుతూ కొడుతూ ఉంటాడు. ఈనెల 14వ తేదీన మద్యం తాగి వచ్చిన అతను ఇంట్లో గొడవపడి మద్యం మత్తులో గడ్డి మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

### ట్రాన్స్‌పోర్టు కంపెనీ పేరుతో మోసం

భీమవరం క్రైం, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తాను కొనుగోలు చేసిన ఫర్నీచర్‌ను ఇంటికి తీసుకొస్తామని ఒక ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ పేరుతో మోసం చేశారని ఒక మహిళ టూటౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి టూటౌన్ ఏఎస్ఐ మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం గరగపర్రు రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఇసుకపల్లి శృతి అనే మహిళ స్థానిక జువ్వలపాలెం రోడ్‌లో ఒక కిడ్స్ స్కూల్ నడుపుతున్నారు. ఆ స్కూల్‌కు ఫర్నీచర్ అవసరం కావటంతో ఢిల్లీ వెళ్ళి ఫర్నీచర్‌ను కొనుగోలు చేసి భీమవరం వచ్చారు. అయితే ఆ ఫర్నీచర్‌ను ఇక్కడకు రప్పించడం కోసం ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు కోసం గాలించగా వీఆర్ఎల్ అనే ఒక కంపెనీ నెంబర్‌కు ఫోన్ చేశారు. ఆ కంపెనీ నిర్వాహకుడు బాగా నమ్మించి రూ.72,500 రూపాయలను ఆన్‌లైన్‌లో చెల్లించమన్నారు. అది నమ్మిన మహిళ డబ్బులు చెల్లించారు. అయితే తరువాత నుంచి అతని ఫోన్ పని చేయకపోవడంతో మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## పోలీసులపై దాడి చేసిన దొంగ నోట్ల ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో 13 మంది నిందితులు
- వీరంతా రాజమహేంద్రవరం, భీమవరం వాసులు
- పరారీలో ఐదుగురు.. స్విఫ్ట్ కారు, నాలుగు బైక్‌లు స్వాధీనం
- అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తప్పించుకుందామని పోలీసులపై ఎటాక్ చేస్తే అసలు డొంక కదిలింది.. భీమవరం కేంద్రంగా సాగుతున్న పెద్ద దొంగ నోట్ల ముఠా బయటపడింది. రాజమహేంద్రవరంలో ఈ నెల 12న అర్ధరాత్రి శ్రీకాకుళం పోలీసులపై ఎటాక్ చేసి దొంగ నోట్ల కేసులో నిందితుడు రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని తీసుకుపోయారు. ఈ సంఘటన సంచలనంగా మారింది. పోలీసులపై ఎటాక్ చేసి నిందితుడిని ఎత్తుకుపోవడంపై ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. మొత్తం 18 మంది పోలీసులపై ఎటాక్ చేసి అదుపులో ఉన్న నిందితుడిని ఎత్తుకుపోయినట్టు గుర్తించారు. అనంతరం తీగలాగితే దొంగనోట్ల ముఠా గుట్టు బయటపడింది. వీరిలో 13 మందిని ప్రకాష్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరులకు సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్ బాబు, ప్రకాష్ నగర్ సీఐ బాజీలాల్ వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా సిగడం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముద్దాయిగా ఉన్న రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని ఈనెల 12న రాత్రి పోలీసులు భీమవరంలో అరెస్టు చేశారు. ఇదే కేసులో రెండో నిందితుడిగా ఉన్న కృష్ణమూర్తి కోసం రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌టవర్ లోకేషన్ వెరిఫై చేయడానికి వచ్చారు.శ్రీకాకుళం పోలీసులు ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌కి వచ్చి తిరిగి ప్రభాకర్‌ను తీసుకుని వెళ్లిపోతుండగా రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్ రోడ్డు వీఎల్ పురం సర్కిల్ లిమిట్స్‌లో కొంత మంది రెండు కార్లు, నాలుగు బైక్‌లపై వచ్చి పోలీసులపై ఎటాక్ చేసి రాపాక ప్రభాకర్‌ను తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై అదే రోజు రాత్రి ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ బాజీలాల్ కేసు నమోదు చేశారు. పోలీస్‌లపై ఎటాక్ చేసిన ముఠా ఆచూకీ కోసం ఆరు బృందాలను రంగంలోకి దింపి విస్తృతంగా గాలించారు. ఎటాక్ చేసినవారంతా దొంగనోట్ల ముఠాకు చెందిన వారని గుర్తించి అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దెయ్యాలతిప్పకు చెందిన నల్లి శశికాంత్, బ్రిడ్జిపేట గునుపూడికి చెందిన పోతుల యాపేతు అలియాస్ వినోద్, గునుపూడి అంబేడ్కర్ నగర్‌కు చెందిన తాళ్ళ జాన్సన్ రాజు, బ్రిడ్జిపేటకు చెందిన పెద్దపాటి మహంకాళి, నేతపూడి క్రాంతి కుమార్, మొగల్తూరు మండలం కవురు వారిపాలెం అంబేడ్కర్ కాలనీకి చెందిన గండుపల్లి కామరాజు, రాజమహేంద్రవరం నెహ్రూనగర్‌కు చెందిన గెద్దాడ శ్రీనాథ్, వై.జంక్షన్ సుబ్బారావు పేటకు చెందిన తురుబిల్లి రామసతీష్, తాడితోటకు చెందిన బుంగా తేజ అలియాస్ ఏలియా, గాంధీపురానికి చెందిన ఇడిసిమళ్ళ సతీష్, ఏవీఏ రోడ్డుకు చెందిన బాలుడు, బుచ్చియ్యపేటకు చెందిన పీతల చిరంజీవి, లక్ష్మీవారపు పేటకు చెందిన నక్కా వెంకట దుర్గా శ్రీ అఖిల్‌లను అరెస్టు చేశామన్నారు. వీరితో పాటుఒక స్విఫ్ట్ కారు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.ఈ కేసులో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. చాలాకాలంగా వీరంతా ముఠాగా ఏర్పడి దొంగనోట్లు మారుస్తున్నట్టు సమాచారం. దీనిలో భాగంగా భీమవరంలో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే అటు భీమవరం ముఠా.. ఇటు రాజమహేంద్రవరం ముఠా రెండూ రంగంలోకి దిగి నిందితుడిని తీసుకెళ్లిపోయారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు పర్యవేక్షణలో కేసును ఛేదించిన సీఐ బాజీలాల్, ఎస్ఐ శివ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్.వెంకట్రావు, సీహెచ్. శ్రీనివాసరావు, క్రైమ్ కానిస్టేబుల్ ఎస్. వీరబాబు, వి.నాగరాజు, టి.వరహాల బాబు, బి.రాజ బాబులను ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. ఎటాక్ చేసిన వారిలో ఆరుగురు రాజమహేంద్రవరం వారే.

## వాహనంపై వెళుతున్న వ్యక్తిపై దాడి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని కొట్టి గాయపరచిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. ఈ నెల 14 వ తేదీన జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన కుంచె కృష్ణ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన కుంచె మోహనరావు తో పాటు కుంచె శ్యామల, కామవరపుకోటకు చెందిన నిట్టా గంగాధరరావు, నిట్టా చందు అడ్డగించి కొట్టడమే కాకుండా బాధితుడు కృష్ణ ఇంటికి అక్రమంగా ప్రవేశించి ఇంట్లో సామగ్రి ధ్వంసం చేశారు. అడ్డు వెళ్ళిన కృష్ణ భార్యను నెట్టివేసి చంపుతామని బెదిరించారు. బాధితుడు కృష్ణ జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందున్నాడన్నారు. అతని ఫిర్యాదు మేరకు నలుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పాత గొడవలతో తల్లీకొడుకులపై దాడి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి సరిహద్దు విషయంలో పాత గొడవల నేపథ్యంలో మిద్దే నాగ సత్య వీర్రాజును, అతని తల్లిని కొట్టి గాయపరిచిన కేసులో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 15వ తేదీన స్థానిక పద్మ థియేటర్ వద్ద మిద్దే నాగ సత్య వీర్రాజు ఇంట్లోకి పఠాన్ ఖాన్‌తో పాటు షేక్ వల్లీ, పఠాన్ షారూఖ్ ఖాన్, పఠాన్ జిలానీ, పఠాన్ షాహీన, పఠాన్ ముంతాజ్ అక్రమంగా ప్రవేశించి వీర్రాజు కొట్టిగాయపరిచారు. వీర్రాజును కొడుతుండగా అతని తల్లి అడ్డు వెళ్ళగా ఆమెను కూడా కొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. దీంతో బాధితులు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీర్రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## సీఐడీ కార్యాలయానికి ప్రిన్సిపాల్ రాణి

కామవరపుకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం తడికలపూడి హర్షిత ఇంగ్లీషు మీడియం స్కూలు ప్రిన్సిపాల్ నందిగం రాణి మంగళవారం తన అనుచరులు, న్యాయవాదులతో రాజమహేంద్రవరంలోని సీఐడీ కార్యాలయానికి వెళ్ళినట్టు సమాచారం. సోమవారం రాజమహేంద్రవరంకు చెందిన సీఐడీ అధికారులు స్కూలుకు రాగా ప్రిన్సిపాల్ నందిగం రాణి వారికి సహకరించకుండా గదిలో ఉండడం తెలిసిందే. సోమవారం రాత్రి వరకు ఆమె గది నుంచి బయటకు రాకపోవడంతో పొద్దుపోయాక గది కిటికీ ద్వారా సీఐడీ డీఎస్పీ జి.శ్రీనివాసరావు బృందం ఆమెకు నోటీసులు ఇచ్చి మంగళవారం రాజమహేంద్రవరంలోని సీఐడీ కార్యాలయానికి హాజరుకావాలని కోరారు. దీంతో మంగళవారం ఆమె విచారణకు వెళ్ళినట్టు సమాచారం. అక్కడి విచారణ ఏవిధంగా జరిగింది, మిగిలిన విషయాలు తెలియాల్సి ఉంది.

## సమగ్ర శిక్ష జీసీడీవో బాధ్యతల స్వీకారం

ఏలూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష జీసీడీవో (బాలికాభివృద్ధి అధికారి)గా నవీనకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మునునూరు ఎంపీ యూపీ స్కూలు టీచరుగా పనిచేస్తున్న ఈమె ఫారిన్ సర్వీసులో ఎస్ఎస్ఏ జిల్లా ప్రాజెక్టులో సెక్టోరల్ అధికారిగా డిప్యూటేషన్‌పై కొద్ది నెలల క్రితమే నియమితులయ్యారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టుకు చాలా కాలంగా ఏపీసీ లేకపోవడంతో విద్యా కార్యక్రమాలపై పర్యవేక్షణ కొరవడటమే గాక, ఉద్యోగ సిబ్బందిలోను నిర్లిప్తత నెలకొంది. ప్రస్తుతం ఇన్‌చార్జి ఏపీసీగా డీఈవో వెంకటలక్ష్మి వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

## రేపు హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏలూరు డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఏలూరు అశోక్‌నగర్‌లోని కె.పి.డి.టి హైస్కూల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఈ.ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 22, 23 తేదీల్లో నెల్లూరు బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే సీనియర్ ఉమెన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని, పాల్గొనేవారు ఆధార్‌కార్డు తీసుకుని రావాలన్నారు. మరింత సమాచారానికి 77299 31797 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## 49 మందికి ఉద్యోగాలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐలో నిర్వహించిన జాబ్‌మేళాకు 79 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో 49 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సంస్థ జిల్లా అధికారి జితేంద్రబాబు తెలిపారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గుండె వైద్య శిబిరం

ద్వారకాతిరుమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కొత్తపల్లిలో మంగళవారం డాక్టర్ వైవీ రావు ఆస్పత్రి నిర్వహణలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ రేగంటి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో రోగులను ఉచితంగా పరీక్షించి మందులు అందజేశారు. సర్పంచ్ కస్సే శ్రీహరి, పోతన ధర్మరాజు, సిద్ధారావు, బాబి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ చెక్కుల పంపిణీ

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రూ. 75 లక్షల విలువైన చెక్కులు అందజేశామన్నారు. మంగళవారం 13 మందికి రూ. 27 లక్షల 11 వేల రూపాయలు చెక్కులు పంపిణీ చేశారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, చోడే వెంకటరత్నం, పెద్దిబోయిన శివప్రసాద్, దాకరపు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### 26న బుజ్జి కాంస్య విగ్రహావిష్కరణ

దివంగత మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి కాంస్య విగ్రహ ఏర్పాటుకు ముందుకు వచ్చిన ప్లాస్ స్వచ్ఛంద సేవా సంస్థకు అభినందనలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఈ నెల 26వ తేదీ బుజ్జి వర్ధంతిని పురస్కరించుకుని అదే రోజు విగ్రహాన్ని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేస్తామన్నారు. కే.సాంబ, వైశ్రీనివాస్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణకు 16 రిక్షాలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో మంచినీరు, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కౌన్సిల్ ముందు ఉంచిన పలు పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం సాధారణ నిధులు రూ. మూడున్నర లక్షలతో చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన 16 రిక్షాలను చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ప్రారంభించారు. చెత్తను రోడ్లపైన, డ్రైన్ లలో వేయవద్దని తమ ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలని కమీషనర్ రమణ సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కంచర్ల వాసవీ రత్నం, ముప్పిడి అంజి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట పరిశీలన

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేరంపేట, పంగిడిగూడెం గ్రామాల్లోని మొక్కజొన్న పంటను యేరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ మంగళవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్నకు గులాబి రంగు పురుగు, కత్తెర పురుగు ఆశించినట్లు తెలిపారు. పంటలో జింకులోపాన్ని గుర్తించారు. గులాబి రంగు పురుగు ఆశించిన మొక్కలు మువ్వ ఎండి పంటకు నష్టం చేకూరుతుం దన్నారు. దీని నివారణకు క్లోర్నిట్రానిప్రోనిల్ 0.3 మిల్లీలీటర్లు కత్తెర పురుగు నివారణకు క్లోర్నిట్రానిప్రోనిల్ లేదా సైనోటర్మ్ 100 మిల్లీలీటర్లు లేదా ఇమామిక్‌ని బెంజోయేట్ 80 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

## హైందవ శంఖారావం విజయవంతం చేయండి

పెదవేగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గన్నవరంలో వచ్చే నెల 5న జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉండవల్లి వెంకట్రావు అన్నారు. విశ్వ హిందూ పరిషత్ ప్రచార రథం మంగళవారం పెదవేగిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. బీజేపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కట్నేని కృష్ణప్రసాద్, కన్నెబోయిన శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రెడ్డియ్య, కంచన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దెందులూరులో డీసీ చైర్మన్లు ఇద్దరిని సన్మానిస్తున్న గ్రామ నీటి సంఘం అధ్యక్షులు



ఎన్నికైన పెదపాడు డీసీ కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం



డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లక్ష్మణ్‌కుమార్, వైస్ చైర్మన్ నాగేశ్వరరావుకు గన్ని అభినందన



నిడమర్రులో ఎంపికైన వారికి పత్రాలు

# నీటి సంఘాల అధ్యక్షులు వీరే..

దెందులూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సాగునీటి వినియోగదారుల సంఘం (డీసీ) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మల్కాపురం, కొవ్వలి, పోతునూరు పరిధిలోని గోదావరి కాల్వ సాగునీటి వినియోగదారుల సంఘం చైర్మన్‌గా కొవ్వలికి చెందిన మల్కాపురం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న వెలమాటి రామచంద్రరావును ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా దోసపాడుకు చెందిన పోతునూరు -దోసపాడు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న అత్తలూరి చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని కృష్ణా కాల్వ సాగునీటి వినియోగదారుల సంఘం చైర్మన్‌గా జాలిపూడి సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడైన మాగంటి నవీన్ చంద్ర బోస్ (బన్ను)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా మాదేపల్లికి చెందిన చింతపల్లి సాల్మన్‌రాజును ఎన్నుకున్నారు.

**పెదపాడు:** పెదపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల పరిధిలోని 3, 4 వాటర్ డిస్ట్రిబ్యూటరీ సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అధికారులు ఎన్నిక నిర్వహించగా, సభ్యులంతా ఏకగ్రీవంగా 3వ డీసీ అధ్యక్షుడిగా బొప్పుడి కాశీబాబు, ఉపాధ్యక్షుడిగా రావాడ గాంధీ, 4వ డీసీ అధ్యక్షుడిగా కలిపిండి అప్పారావు, ఉపాధ్యక్షులుగా తెర్లి వెంకటరమణను ఎన్నుకున్నారు. వీరికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

**భీమడోలు:** గుండుగొలను డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ కమిటీ ఎన్నికలు కూటమికి ఏక గ్రీవమయ్యాయి. కైకరం, అంబర్‌పేట, భీమడోలు, గుండు గొలను, పూళ్ళకు చెందిన ఐదు నీటి సంఘాల అధ్యక్షులు ఈ ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఆర్ అండ్ బీ ఈఈ వై కిషోర్‌బాబు ఎన్నికల అధికారిగా ఆయన అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా గంధం వెంకట లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా డేకల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ రమాదేవి, మైనర్ ఇరిగేషన్ ఏఈఈ కె లాజర్‌బాబు పాల్గొన్నారు. ఎన్నిక అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు సంఘ సభ్యులు ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారిని గన్ని అభినందించారు.

**నిడమర్రు:** అడవికొలను డీసీ చైర్మన్‌గా చానమిల్లి సాగునీటి సంఘ అధ్యక్షుడు బేతు వెంకట శివ రామారావు ఎన్నికయ్యారు. మంగళవారం నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో డీసీ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. చానమి ల్లి సాగునీటి సంఘం అధ్యక్షులైన బేతు వెంకట శివ రామారావును అడవికొలను డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గా, వైస్‌చైర్మన్‌గా అంబళ్ళ వేణు ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఉంగుటూరు:** తాడేపల్లిగూడెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఇరిగేషన్ ఈఈ ఎం.సత్య నారాయణ నేతృత్వంలో జరిగిన ఎన్నికలో రాచూరు, చిన నిండ్రకొలను, బాదంపూడి, ఉంగుటూరు, చేబ్రోలు సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం డీసీ చైర్మన్‌గా ఉంగుటూరు నీటి సంఘం అధ్యక్షుడు రెడ్డి శివ ప్రసాద్, వైస్ చైర్మెన్ గా రాచూరు నీటి సంఘం అధ్యక్షుడు మందా నాగేశ్వర రెడ్డి ఎన్నికయ్యారు.



సదస్సులో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ప్రభాకర్

## 'రెవెన్యూ సదస్సులతో భూ కబ్జాలకు చెక్'

పెదవేగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో ఐదేళ్ళపాటు సాగిన భూ కబ్జాలకు రెవెన్యూ సదస్సుల్లో విముక్తి లభించిందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ మాట్లాడారు. సదస్సులో పలువురు రైతులు తమ సమస్యలపై వినతులు అందించారు. పెదవేగి మండల ప్రత్యేకాధికారి ఎ.రామ్ కుమార్, తహసీల్దారు ఎస్డీ భ్రమరాంబ, ఆర్ఐ కేబీవీ సారథి, మండల సర్వేయర్ సత్యనారాయణమూర్తి, దుగ్గిరాల సర్పంచ్ గంజా క్రీస్తుమణి, రైతులు పాల్గొన్నారు.

**చింతలపూడి:** రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని చింతలపూడి తహసీల్దార్ డి.ప్రమద్వర అన్నారు. మంగళవారం రేచర్ల, తీగలవంచ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రేచర్ల సర్పంచ్ శివరామకృష్ణ, కూటమి నాయకులు కె.శ్రీనివాస్, వెంకటేశ్వర రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**లింగపాలెం:** రైతులు తమ గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకొని భూసమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. పుప్పాల వారిగూడెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యలపై 10 అర్జీలు వచ్చినట్టు తెలిపారు.

**పెదపాడు:** రెవెన్యూ గ్రామ సభల్లో స్వీకరించిన అర్జీలు సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ తెలిపారు. పెదపాడు మండలం కొత్తముప్పర్రులో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు ఎ.కృష్ణకుమారితో కలసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలున్న వారు గ్రామ సభలను వినియోగించుకోవాలన్నారు.

**కామవరపుకోట:** రెవెన్యూ గ్రామసభల్లో ప్రజల వినతులపై విచారణ నిర్వహించి పరిష్కరిస్తా మని కామవరపుకోట తహసీల్దార్ గెడ్డం ఎలీషా స్పష్టం చేశారు. మంగళవారం తూర్పు యడవల్లిలోని గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును నిర్వహించి వినతిపత్రాలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకున్నారు. ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో నాగయ్య పాల్గొన్నారు.

**టి.నరసాపురం:** భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ సాయిబాబా తెలిపారు. టి.నరసాపురంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల సమస్యలపై వినతులు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకంలో పేర్లు తప్పులు, ఆధార్ లింక్ అవ్వనివి, పట్టా ఇచ్చి భూమి చూపించకపోవడం, మ్యుటేషన్, అడంగల్ కరెక్షన్లు వంటి సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, విఆర్‌ఓ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కో-ఆర్డినేటర్లకు వేతనాలేవీ?

ఏలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జిల్లా పంచాయతీ విభాగం నోడల్ అథారిటీ ద్వారా నియమించిన మండల స్థాయి కోఆర్డినేటర్లకు వేతనాలు ఇప్పించాలని కోరుతూ మంగళవారం బీజేపీ ఏలూరు జిల్లా దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో డీఆర్వోను కలిసి వినతిపత్రం అందించారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన నిరుద్యోగులకు గత ఏడాది మండల కోఆర్డినేటర్లుగా నియమించారని, నేటివరకు జీతభత్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని గత ఎన్నికల్లో కూడా వీరి విధులను, సేవలను ప్రభుత్వం వినియోగించు కుందన్నారు. దళిత మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ మాట్లాడేవారికే పదోన్నతి కల్పించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరపాలక సంస్థలో ఉన్న ఉర్దూ మీడియం పాఠశాలలకు ప్రధానోపాధ్యాయ పదోన్నతిలో సీనియార్టీని బట్టి ఉర్దూ మాట్లాడేవారినే నియమించాలని తంగెళ్ళమూడి ఉర్దూ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ అబ్దుల్ అజీమ్, కార్పొరేటర్ ఎమ్డీ ఇలియాస్ బాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొన్ని ప్రత్యేకమైన పాఠశాలలకు ప్రత్యేకమైన విద్యార్హతలు ఉండాలని జీవోలో స్పష్టంగా ఉందన్నారు. కోఆప్షన్‌సభ్యుడు అబ్దుల్ కలీల్, ఎమ్డీ జిలానీ, ఫజులుల్లా షరీఫ్, ఎస్.కె షకీరా తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## షర్మిల పుట్టినరోజు వేడుకలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి జన్మదినోత్సవం మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ నేతలు కొమ్మన సాంబ శివరావు, తీడ సత్యనారాయణ, తాళ్ళూరి చక్రవర్తి, పెద్దిరెడ్డి పద్మ, సంకు శివప్రసాద్, రంభ ప్రసాద్, కె.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు. మిఠాయిలు పంపిణీ చేశారు.

**పెదవేగి:** పేదల సంక్షేమం కాంగ్రెస్‌తో ముడిపడి ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ అన్నారు. ముండూరులో దెందులూరు నియోజకవర్గం పార్టీ కో ఆర్డినేటర్ ఆలపాటి నరసింహమూర్తి ఇంటి వద్ద మంగళవారం షర్మిల జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచారు. అలాగే 150 మంది వృద్ధులకు దుప్పట్లు పంచారు. కాంగ్రెస్ పార్టీ పెదవేగి, పెదపాడు మండల అధ్యక్షులు చిలకలపూడి తాతాకృష్ణ, రంభ కిషోర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యుడు మోదిత్‌కుమార్‌సింగ్

## నిర్వాసితుల సమస్యలు కేంద్రానికి నివేదిస్తాం

జీలుగుమిల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పి.నారాయణపురం శివారు నిర్వాసిత టేకూరు కాలనీలో కేంద్ర బృంద సభ్యుడు మోదిత్‌కుమార్ సింగ్ పర్యటించారు. నిర్వాసితులకు నష్టపరిహారం, ఇళ్ల నిర్మాణం, సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన అంశాలపై గిరిజనులతో చర్చించారు. గతంలో 18 ఏళ్లు నిండిన వారికి ప్రభుత్వం రూ. 6లక్షలు చెల్లించాల్సి ఉందని, తమను నిర్వాసిత కాలనీలకు తరలించి ఇప్పటికి నాలుగేళ్లు అయ్యిందని, దీంతో అప్పటి ప్యాకేజీ దక్కని కొందరు ఆడపిల్లలు పెళ్లిళ్లు చేసుకుని అత్తారిళ్లకు వెళ్లిపోయారన్నారు. నిర్మించిన కొన్ని ఇళ్లు వర్షాకాలం వస్తే స్లాబ్‌లు చెమ్మగిల్లుతున్నా యన్నారు. చదువుపూర్తి చేసుకున్న యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలన్నారు. 5 ఎకరాలు భూమి ఉన్న ప్రతి ఒక్కరికి బోరు సదుపాయం కల్పించాలని, భూములకు పరిహారం చెల్లించాలని నిర్వాసితులు తెలిపారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రంలో మందులు, పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఎలా ఉందో పరిశీలించారు. వారి సమస్యల్ని కేంద్రం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఎస్‌డీసీ రామ్‌నాయక్, ఆర్డీవో ఎంవి.రమణ, ఇన్‌చార్జీ తహసీల్దార్ స్లీవజోజి, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ రాజేష్‌కుమార్, డిప్యూటీ డైరెక్టరు ఎం.రవి, ఎస్సై పి.నవీన్‌కుమార్, వీఆర్వో అశోక్ ఉన్నారు.

## 6 నెలల్లో ఎంతో సాధించాం : ఎంపీ పుట్టా

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఆరునెలల పాలనలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 12,500కోట్లు మంజూరులో కీలకపాత్ర పోషించామన్నారు. పామాయిల్ దిగుమతుల పై 27.5 శాతం సుంకం విధించటం ద్వారా రైతులకు రూ.20వేలు గిట్టుబాటు ధర లభించిందని, పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించటం ద్వారా రూ. 110 కోట్లు లబ్ధి రైతులకు చేకూరిందన్నారు. ఏలూరులో వందే భారత్ రైళ్ల హాల్ట్ ఏర్పాటుకు కృషి చేశామ న్నారు. యువతకు ఉద్యోగ కల్పన కోసం జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. వరద బాధి తుల కోసం సీఎం సహాయనిధికి రూ.25 లక్షల చెక్కు అందించటం ఆనందరం కలిగించిందన్నారు.

## ఉత్సాహంగా సైక్లోథాన్

ఏలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళవారం ఏలూరు సాయి సెంటర్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా సైక్లోథాన్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. స్థానిక ఏ.ఎస్.ఆర్ స్టేడియంలో సైక్లింగ్ పోటీని ఒలింపిక్ అసోసియేషన్, వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య ఉపాధ్యక్షుడు బడేటి వెంకటరామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడుతూ సైక్లింగ్‌ను నిత్య జీవితంలో ఒక భాగంగా చేసుకో వాలన్నారు. చైనా, మలేషియా, సింగపూర్ వంటి దేశాల్లో 80శాతం సైకిల్ వినియోగిస్తార న్నారు. పెద్దసంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. సాయి సెంటర్ ఇన్‌చార్జ్ వినాయక ప్రసాద్ తదితరులు విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



### హాఫ్ మారథాన్‌లో సాయిరాం తృతీయం

**భీమడోలు:** భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బీఏ ఫస్టియర్ విద్యార్థి పి. సాయిరాం ఈనెల 13,14 తేదీలలో ఆదికవి నన్నయ వర్సిటీలో జరిగిన హాఫ్ మారథాన్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాడు. సాయిరాంను ప్రిన్సిపాల్ బి.రవి కుమార్ పి.డి.సురేష్‌కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ కే.శివ శంకర్. ఎ. శ్రీనివాస్ అభినందించారు.

## నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులు



ఏలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):అభినయ నృత్యభారతి జాతీయ స్థాయి నృత్యోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు. కూచిపూడి సబ్ జూనియర్స్ విభాగంలో టి. యోజశ్విని ప్రథమ, సి.మిషిక ద్వితీయ, దేదీప్య తృతీయ, జూనియర్స్ విభాగంలో జె.ఆరాధ్యరెడ్డి ప్రథమ, ఎస్.భువన కృతి ద్వితీయ, గగనాన్విక తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. సీనియర్స్ విభాగంలో దేవిచందన, కావ్య లాలిత్య ప్రథమ, ద్వితీయ, తృతీయ, జానపదంలో సబ్ జూనియర్స్ విభాగంలో ప్రేమమయి ప్రథమ, జి.భవిష్య ద్వితీయ, డి.వైష్ణవి తృతీయస్థానాలు ఇంకా వివిధ విభాగాల్లో ప్రదర్శనలిచ్చిన చిన్నారులకు కన్సొలేషన్ బహుమతులు అందచేశారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, మనోహర్ గోపాల్ లునాని, లయన్స్ జిల్లా గవర్నర్ కె.వేణుబాబు, ఉప గవర్నర్ డి.సుబ్బారావు చేతులమీదుగా బహుమతులు అందచేశారు.



రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

# ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ఏలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని, ట్రాన్స్‌కో ఎస్ఈ పి.సాల్మన్‌రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.ఎమ్ అంబేడ్కర్, పి.రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక సాహిత్య మండలి ప్రాంగణంలో ఏపీ తూర్పు ప్రాంత విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వ శాఖాపరంగా రావాల్సిన రాయితీలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. అనంతరం పలువురు రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఎస్. నాగిరెడ్డి, డాక్టర్ పి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, అధ్యక్షుడు కృష్ణమూర్తి, కె.రంగా రావు, ఎన్.పేర్రాజు, జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం:** స్థానిక పెన్షనర్స్ భవనంలో ఏపీ స్టేట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ, కార్యదర్శి కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఏటీవో కె.చంద్రయ్య, ఎస్‌టీవో చినబాబు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజరు ఏ.రాజేష్, రామచంద్రా మ్యాక్స్ సొసైటీ చైర్మన్ బి.వి కృష్ణారావు విచ్చేశారు. ఉద్యోగ విరమణ చేసిన సభ్యులను, ముఖ్య అతిథులను సన్మానించారు. కోటిపల్లి మస్తాన్, పువ్వుల కాళిదాసు, సుశీలావతి, కంచర్ల అప్పారావు, ఎం.వెంకట్రావు, నారాయణరావు, అంజయ్య, శకుంతలా దేవి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

**ఏలూరు కార్పొరేషన్:** ది జోనల్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కోటదిబ్బ సర్వీసు రిజర్వాయరు వద్ద 43వ జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు మధ్యాహ్నపు దుర్గారావు, ఎ.అప్పలరాజు, ఏఈ సాయి, ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.హరినాథ్ బాబు, యూనియన్ కోశాధికారి వి.నారాయణరావు, నగర పాలక సంస్థ ఎస్ఈ రాజేంద్రకృష్ణ, డీఈఈ రజాక్, యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

**భీమడోలు:** భీమడోలు పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా జిల్లా ఖజానా అధికారి పి కృష్ణ, భీమడోలు ఎస్టీవో ఎన్ శ్రీనివాసరావు, అడ్వైజర్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. పెన్షనర్స్‌కు సహాయం అందిం చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎంసి కోటయ్యను ఘనంగా సత్కరించారు. బ్రహ్మారావు మాస్టారు, వైఆర్‌కె శర్మ, గంధం వెంకట్రావు, ఫణికుమార్, అప్పారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భోగరాజు పట్టాభి సీతారామయ్యకు నివాళి

భీమడోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య వర్ధంతి మంగళవారం గుండుగొలను గ్రామంలో జరిగింది. గుండుగొలను గ్రామ పట్టాభి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పట్టాభి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు కాళీ బాబు మాట్లాడుతూ నేటి యువత సీతారామయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

## సుస్థిర అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

బుట్టాయగూడెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో సుస్థిర అభివృద్ధి సాధించాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు అనే అంశంపై మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యదర్శులు, డిజిటల్, వెటర్నరీ, ఇంజనీరింగ్, సర్వే అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, జేఎల్ఎంలు, మహిళా సంరక్షణా కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.


## ప్రజలకు జీవనాధారమైన అభివృద్ధి కల్పించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జీవనాధారమైన అభివృద్ధి కల్పించాలని ఇందుకోసం ప్రతి గ్రామపంచాయతీలో ప్రణాళికలు తయారు చేయాలని ఏలూరు ఎంపీడీవో వి.శ్రీలత అన్నారు. రెండురోజుల శిక్షణలో భాగంగా ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందితో ఏర్పాటుచేసిన శిక్షణా సమావేశానికి హాజరై మాట్లాడారు. అన్నిశాఖల అధికారులు సర్పంచ్‌లతో కలిసి ప్రజలకోసం పాటుపడాలన్నారు. అనంతరం పంచాయతీలో పంచాయతీరాజ్ నిర్వహించే పలు అంశాల పై పిఆర్‌ఏఈ మురళీకృష్ణ వివరించారు.

**కామవరపుకోట:** స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపిడిఓ సరళకుమారి, ఎఓ ఎస్.రూన్సీరాణిలు మండలంలోని సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ డిజిటల్, వెటర్నరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, సర్వే అసి స్టెంట్‌లు, ఎఎన్ఎంలు, జెఎల్ఎంలు, మహిళా సం రక్షణ అధికారులు, గ్రేడ్-2 విఆర్వోలు పాల్గొన్నారు.

## చలికాలంలో ఆరోగ్య సమస్యలపై అవగాహన

ఏలూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శీతాకాలం ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మలేరియా విభాగం ఆధ్వర్యంలో తంగెళ్ళమూడి, ఎమ్మార్సీ కాలనీ, కబడ్డీ గూడెంలలో స్థానికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దగ్గు, జలుబు, ఆయాసం, తుమ్ములు, ఆస్మా, జ్వరాల బారిన పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించాలని, ఆహారం వేడివేడిగా భుజించాలని, గోరువెచ్చని నీరు తాగాలని, చలిలో ఎక్కువగా పనిచేయరాదని, శీతల పానీయాలను తాగరాదని కోరారు. దోమలు అభివృద్ధి చెందకుండా పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కరప త్రాలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా ఏలూరులో డీఈవో ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థినిలు బహుమతులు సాధించారు. మంగళవారం విజేతలకు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయ్‌ప్రకాష్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో క్విజ్‌లో ప్రథమ స్థానం సాధించిన 9వ తరగతి విద్యార్థిని మల్లవరపు శ్రీప్రియ, వ్యాసరచనలో తృతీయ స్థానం సాధించిన 9వ తరగతి విద్యార్థిని వల్లూరి సాయిప్రసన్న డీఈవో వెంకటలక్ష్మమ్మ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని హెచ్ఎం విజయప్రకాష్ తెలిపారు.

# చినుకు.. వణుకు..

## రైతుల గుండెల్లో తుఫాన్ దడ



ముదినేపల్లిలో నేలమట్టమైన వరి పైరు

ముదినేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో వాతావరణం మారడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణ శాఖ భారీ వర్ష హెచ్చరికలు చేస్తుండటంతో రైతులు పరుగులు పెడుతున్నారు. వేలాది ఎకరాల ఆయకట్టులో నేలమట్టమైన వరి పైరు పొలాల్లో ఉండగా, వందలాది మెట్రిక్ టన్నుల ధాన్యం రోడ్ల వెంబడి ఆరబెట్టి అమ్మకానికి సిద్ధంగా ఉంది. మండలంలో సుమారు 3 వేల ఎకరాల్లో వరి పైరు కోయాల్సి ఉండగా, 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మాల్సి ఉంది. పొలాల్లోని వరి పైరును కోసే అవకాశం లేకపోవడం, పలుచోట్ల ఇంకా పసిరిగా ఉండ డంతో వర్షం కురిస్తే పంట చేతికి దక్కే అవకాశాలుండవని రైతులు ఆందోళన చెందుతున్నారు. పది రోజులుగా వాతావరణం మబ్బులు ఉన్నా రోడ్ల వెంబడి ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు ఇప్పుడు వర్షాల హెచ్చరి కలతో బెంబేలెత్తిపోతున్నారు. ధాన్యాన్ని రాశులుగా చేసి పరదాలు కప్పుతున్నారు. నేల కొరిగిన వరి పైరు ఇప్పటికే పాడైపోయిందని, వర్షాలు కురిస్తే పంట పొలాల్లో వదిలేయటం తప్ప చేసేదేమీ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత తుఫాను కష్టాలు మరువక ముందే మళ్లీ అల్పపీడనం రైతుల పాలిట అశనిపాతంలా మారింది.

## టీచర్లకూ ప్రశ్నపత్రాలు ఇవ్వండి : డీసీఈబీ

ఏలూరు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):ప్రస్తుతం జరుగుతున్న ఎస్‌ఏ-1 పరీక్షల ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్ల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రతీరోజూ వెళ్ళి తెచ్చుకుని పరీక్షను నిర్వహించాలన్న నిర్ణయాన్ని సమీక్షించి మార్పులు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, సుబ్బారావు డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిర్ణయంవల్ల 15 నుంచి 20 కిలోమీటర్ల దూరానికిపైగా రాకపోకలు సాగించాల్సిన హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖాధికారులే సీఎంఆర్టీల ద్వారా తగిన సెక్యూరిటీతో పాఠశాలలకు పరీక్ష పేపర్లు చేర్చేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ప్రశ్నపత్రాలు లీక్‌చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సోమవారం జరగాల్సిన ఎస్‌ఏ-1 పరీక్షల గణితం ప్రశ్నపత్రం కోనసీమ, వైజాగ్, గుంటూరు జిల్లాల నుంచి లీకై యూట్యూబ్‌లో ప్రత్యక్షమైనట్టు ఆరోపణలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆ పరీక్షను వాయిదా వేసి, తిరిగి ఈ నెల 20న నిర్వహించడానికి నిర్ణయించిన విషయం విదిత మే. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే చర్యల్లో భాగంగానే వాటిని పోలీసు స్టేషన్లలో భద్రపరిచి, పరీక్ష జరిగే రోజున స్కూలు హెచ్‌ఎంలు స్వయంగా హాజరై తీసుకెళ్ళాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో మండ లానికి ఒకటి చొప్పున ఉండే పోలీసు స్టేషన్‌కు దాని పరిధిలోవున్న 6 నుంచి 8 ఉన్నత పాఠశా లల ప్రధానోపాధ్యాయులు ప్రశ్నపత్రాలను తీసుకెళ్ళేందుకు రాకపోకలు సాగించాల్సిరావడం ఒకింత కష్టమేనని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. మరో మూడు పరీక్షలు మాత్రమే మిగిలివున్న నేపథ్యంలో ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రాలను తీసుకెళ్ళేందుకు పోలీసు స్టేషన్‌కు సంబంధిత స్కూలు హెచ్‌ఎం రాకపోయినా, ఆయన అధీకృత లేఖతో పోలీసుస్టేషన్‌కు స్కూలు టీచరు ఎవరు వచ్చినా ఇవ్వాలని జిల్లా కామన్ పరీక్షల మండలి (డీసీఈబీ) మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.



డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతి పత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా నాయకులు

ఇక మీదట నిర్వహించే ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాలన్నీ ఆయా జిల్లాలను యూనిట్‌గా తీసుకుని స్థానికంగానే (రాష్ట్రమంతటా ఒకే ప్రశ్నపత్రం బదులుగా జిల్లా స్థాయిలో) క్వశ్చన్ పేపర్ రూపకల్పన, ముద్రణ, పంపిణీ బాధ్యతలను అప్పగిస్తే లీకేజీలను సమర్థవంతంగా అరికట్టవచ్చునని డీసీఈబీ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన సూచనలు, ప్రతిపాదనలపై ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. ఈ ప్రత్యామ్నాయ సూచనలపై అధికారికంగా ఎటువంటి ప్రకటన లేదు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :మద్యానికి బానిసైన ఒక వ్యక్తి మద్యం మత్తులో పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్ళలంక గ్రామానికి చెందిన గోవిందు సీతారామాంజ నేయులు (38)కి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిస అయ్యాడు. ఏ పని చేయకుండా అతిగా మద్యం తాగుతూ ఇంట్లో భార్య, పిల్లల్ని తిడుతూ కొడుతూ ఉంటాడు. ఈనెల 14వ తేదీన మద్యం తాగి వచ్చిన అతను ఇంట్లో గొడవపడి మద్యం మత్తులో గడ్డి మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించ గా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏలూరు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

## మామిడిలో సస్యరక్షణ చేపట్టండి



నూజివీడు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):మామిడితోటల్లో పూతలు రావడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవనశాఖ అధికారిణి ఆర్.హేమ తెలిపారు. బోర్వంచ, యనమదల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిలో పూతలు రావడానికి పొటాషియం నైట్రేట్ పదిగ్రాములు, బోరాన్ రెండు గ్రాములు, జింకుసల్ఫేట్ రెండు గ్రాములు, వేపనూనె మూడు మిల్లీగ్రాములు లీటరు నీటికి కలిపి పిచి కారి చేయాలని సూచించారు. డిసెంబర్ 31 వరకు మామిడికి వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం కట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు.

### విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ఆందోళన

నూజివీడు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించా లని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నూజివీడు చిన్నగాంధీ బొమ్మసెంటర్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.రాజు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచుతూ మోయలేని భారం వేసిన కూటమి ప్రభుత్వం తాను ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన ఛార్జీలను ఉపసంహరించుకోవాలని కోరారు.

### హేలాపురి కాలేజీలో క్రికెట్ పోటీలు ప్రారంభం

దెందులూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి), తూర్పు, పశ్చిమ, కృష్ణా, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల పరిధిలో యునివర్శిటీ స్థాయి క్రికెట్ పోటీలు హేలాపూరి కాలేజీలో ప్రారంభమయ్యాయి. దెందులూరు మండలంలో గోపన్నపాలెం శివారువేగవరంలోని హేలాపూరి టెక్నాలజీ అండ్ సైన్సు ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో ఈనెల 21 తేదీ వరకూ బాలుర విభాగంలో యూనివర్శిటీ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారు మంగళవారం వేగవరం హేలాపూరి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ లావణ్య ప్రారంభించారు. జేఎన్‌టీయూ పరిధిలోని 65 టీమ్‌లతో కాలేజీ క్రీడా మైదానంలో పోటీలను నిర్వహిస్తున్నట్టు కాలేజీ ఏవో కరుణానిధి తెలిపారు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లావణ్య

### మోడరన్ హరిదాసు



సంక్రాంతి సీజన్ మొదలు కావడంతో గ్రామాల్లో మోడరన్ హరిదాసులు సందడి చేస్తున్నారు. గతంలో హరిదాసులు బిక్ష పాత్ర నెత్తిపెట్టుకొని హరి కీర్తనలు పాడుకుంటూ వీధుల్లో తిరిగేవారు. కొన్నేళ్లుగా హరిదాసులు స్టయిల్ మార్చారు. మోపెడ్‌పై బిక్ష పాత్ర బిగించి, టేప్, రికార్డర్‌లో భక్తి పాటలు పెట్టుకొని ఇంటింటికి వస్తున్నారు. చూస్తుండగానే ఎంత మార్పు వచ్చింది అని వృద్ధులు ఆశ్చర్యపోతున్నారు. కళలు, సంస్కృతులు ఆచారాలలో కాలానుగుణంగా ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో మోడరన్ హరిదాసులు కూడ ఒకటి. సంక్రాంతి పండుగ అంటే గ్రామీణ ప్రజలకు ప్రత్యేకమైనది. ఈ మాసంలో ధనిక పేద తేడా లేకుండా ఇంటి ముందుకు యాచకులు ఎవరు వచ్చినా లేదనకుండా దానం చేస్తుంటారు. రైతులకు కొత్త ధాన్యం ఇంటికి రావడం, కూలీలకు కూడా దండిగా పనులు దొరకటం వలన సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో అడంబరంగా జరుపుకోవడం ఆనవాయితీ. - చాట్రాయి

# సాగునీటి సంఘాలతో కాల్వల అభివృద్ధి



కైకలూరులో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు భోగేశ్వరరావు, సత్యనారాయణను అభినందిస్తున్న నాయకులు

కైకలూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ద్వారా నియోజకవర్గంలోని కాలువలు అభివృద్ధి అవుతాయని, శివారు భూములకు సైతం నీరందించేలా సంఘ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గంలో మంగళవారం డీసీ చైర్మన్లు, వైస్‌డీసీ చైర్మన్లు ఎన్నిక ఏకగ్రీవాలుగా జరిగాయి. కైకలూరు డీసీ చైర్మన్‌గా పల్లెవాడ సాగునీటి సంఘాల అధ్యక్షుడైన పొత్తూరి వాసురాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా దొడ్డిపట్ల సాగునీటిసంఘాల అధ్యక్షులు వేటుకూరి పెద్దిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్లకు, డీసీ చైర్మన్లకు కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఎమ్మెల్యే కామినేని ఘనంగా వారిని సత్కరించారు. కాలువల అభివృద్ధి రైతులకు పంటలకు నీరు, ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందించేందుకు నీటి సంఘాలన్నీ కష్టపడి పనిచేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలువలను అభివృద్ధి చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయా రన్నారు. నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల సభ్యులంతా ఐక్యతతో రైతుల సంక్షేమం కొరకు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీర మల్లు నరసింహారావు, ముదునూరి సీతారామ రాజు, పెన్మెత్స త్రినాథరాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, పోకల జోగిరాజు అంగ్రాజు శ్రీనివాస రావు, తేరా రమేష్‌బాబు, బొర్రా చలమయ్య, తదితరులు పాల్గొన్నారు.

### కలిదిండి, కోరుకొల్లు ఏకగ్రీవం..

కలిదిండి: మండలంలో కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలిదిండి డీసీ చైర్మన్‌గా ముద్దం భోగేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా నాగిడి వీరబ్రహ్మం, కోరుకొల్లు డీసీ చైర్మన్‌గా పేటేటి వెంకట సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా నున్న కృష్ణబాబు ఎన్నికయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నున్న రమాదేవి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ్రాజు శ్రీనివాస్, వలవల రామారావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ వారిని అభినందించారు.



పెదగొన్నూరు డీసీ చైర్మన్ సురేష్‌బాబు, వైస్ చైర్మన్ సోమేశ్వరరావు



ముదినేపల్లి డీసీ చైర్మన్ నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ పేర్నీడు

### ముదినేపల్లిలో..

ముదినేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఎన్నికల అధికారులు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సిహెచ్.మధుభూషణరావు, భూగర్భ జలాల డీడీ పీఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన 12 నీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో పెద గొన్నూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా గుడిసేవ సురేష్‌బాబు, వైస్ చైర్మన్‌గా పోతుమూడి సోమేశ్వరరావు, ముదినేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా నారగాని నాగేశ్వరరావు (కొండ), వైస్ చైర్మన్‌గా హనుమార పేర్నీడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ సిద్ధార్థ, పాల్గొన్నారు. పలువురు నాయకులు అభినందించారు.

# భూ సమస్యల పరిష్కారం ప్రభుత్వ లక్ష్యం

కలిదిండి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పోతుమర్రులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో భూ రీసర్వే పేరిట అనేక సమస్యలు తలెత్తడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు రైతుల వద్దకే వస్తున్నారని, సమస్యలను వివరించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ నాగలక్ష్మి, భీమరాజు, బాండు రాజు, బలరామరాజు, తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, వీఆర్వో జి.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి: రైతులు భూములకు సంబంధించిన సమస్యలు ఎదుర్కొకుండా శాశ్వత పరిష్కారం చూపటమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని ముదినేపల్లి మండల ప్రత్యేకాధికారి టి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఊటుకూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ సమస్యలను రైతులు పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సదస్సులో పలువురు రైతులు భూముల సర్వే, సబ్ డివిజన్లకు సంబంధించిన సమస్యలపై అర్జీలను అందజేశారు. తహసీల్దార్ సుభానీ, సర్పంచ్ వరలక్ష్మి, వీఆర్వో సందీప్ తదితరులు పాల్గొన్నారు.

● కైకలూరు: భూసమస్యల పరిష్కారం కొరకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తుందని ప్రతీ రైతు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు మండలం ఆటపాకలో జరిగిన రెవెన్యూ సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భూసర్వే పేరుతో వైసీపీ చేయని అక్రమాలు, అరాచకాలు లేవని వారు చేసిన పనివల్లన రాష్ట్రంలో ప్రతీ రైతు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొంత డబ్బా కొట్టుకునేందుకు భూసర్వే పేరుతో కోట్ల రూపాయల విలువ చేసే భూములు వైసీపీ నేతలు ఆక్రమించేశారని ప్రభుత్వం వారిపై ఉక్కుపాదం మోపి భూములను తిరిగి తీసుకునే పనుల్లో ఉందన్నారు. రీసర్వే జరిగిన తప్పులతో రైతులకు రుణాలు సైతం రీషెడ్యుల్ అవ్వని పరిస్థితులు నెలకొన్నాయని పూర్వీకుల నుండి వచ్చిన ఆస్తిని విక్రయించేందుకు కూడా అవకాశం లేకుండా చేశారన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రతీ రైతు సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, సర్పంచ్ తలారి జాన్‌మణి, కూటమి నేతలు కెవిఎన్‌ఎం నాయుడు, కొల్లి వరప్రసాద్, నల్లగోపుల చలపతి, శొంఠి రాజేశ్వరీ, మండల ప్రత్యేకాధికారి కె.నాగలింగాచారి, తదితరులు పాల్గొన్నారు.

# వేంపాడు మేజర్ చైర్మన్‌గా రాపర్ల ఏకగ్రీవం



ముసునూరులో ఎన్‌ఎస్పీ మేజర్ చైర్మన్, వైస్ చెర్మన్‌లను అభినందిస్తున్న కూటమి నాయకులు

ముసునూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ఎడమకాలువ (వేంపాడు మేజర్) ముసునూరు-16 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చెర్మన్‌గా కాట్రేనిపాడుకు చెందిన రాపర్ల బాలకృష్ణ, వైస్ చైర్మన్‌గా లోపూడికి చెందిన చలమాల వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, డీఎల్‌డీవో వెంకటరత్నం ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అయితే బాలకృష్ణ, వెంకటేశ్వరరావులు మాత్రమే నామినేషన్లు వేశారు. దీనితో ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కార్యాక్రమంలో ఎంపీడీవో జి.రాణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వి రమణ, టీడీపీ నాయకులు కొల్లి గంగారామ్, గద్దె రఘుబాబు, చిలుకూరి వెంకటేశ్వరరావు, కాటేపల్లి శ్రీనివాసరావు, పాలడుగు నాగేంద్రబాబు, బొల్లినేని బుజ్జియ్య, తల్లిబోయిన సత్యనారాయణ, గద్దల మోహన్‌రావు, రాపర్ల ప్రతాప్, కందుల పిచ్చియ్య, ఉప్పలపాటి గణేష్ పాల్గొన్నారు.

## వృద్ధులకు సన్మానం

నూజివీడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 42వ అఖిలభారత పెన్షనర్స్‌డే దినోత్సవాన్ని సీనియర్ సిటీజన్స్ సంక్షేమ సంఘం భవనంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో వాణి, పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. వృద్ధులను ఎవరూ భారంగా భావించకూడదన్నారు. నూజివీడు అసిస్టెంట్ ట్రెజరీ అధికారి ముప్పాళ్ల పల్లవి, పట్టణ సీఐ శ్రీనివాస్, పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు బండారు సత్యనారా యణ, టి.పిచ్చియ్య, పి.మాధవరావు, స్టాలిన్ పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్:** గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీపీఆర్ కళాశాలలో జాతీయ పెన్షనర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపఖజానాశాఖ అధికారిణి పల్లవి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఈమని శేషయ్య, కార్యదర్శి సోమయాజులు, ట్రెజరర్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మామిడి రైతుల సదస్సు

నూజివీడు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):మామిడి రైతులు, వ్యాపారస్తులతో బుధ వారం ఉదయం 10 గంటలకు నూజివీడు మార్కెట్‌యార్డులో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉద్యానవనశాఖ అధికారిణి ఆర్.హేమ తెలి పారు. మామిడి మార్కెట్ యార్డు ఏర్పాటుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

### సర్పంచ్‌లకు శిక్షణ

ముసునూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సుస్థిర అభివృద్ధి సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నూజివీడు డీఎల్‌డీవో వెంకటరత్నం, ఎంపీడీవో జి.రాణి అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి ముసునూరు మండల కార్యాలయంలో మంగళవారం తొలిరోజు శిక్షణకార్యాక్రమం జరిగింది.

## ‘శివరామకృష్ణ పై చర్యలు తీసుకోవాలి’

నూజివీడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణపై జనసేనపార్టీ అదిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నట్లు జనసేన పార్టీ సమన్వయకర్త బర్మాఫణిబాబు తెలిపారు. గౌడసంఘం ఆధ్వర్యంలో గౌతులచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆవిష్కరణకు వైసీపీ నాయకులు జోగి రమేష్‌ను ఆహ్వానించి అధికారపార్టీ నాయకులతో కలిపి చేయించటంలో శివరామకృష్ణ పాత్రపై కూటమినాయకుల్లో తీవ్ర విమర్శ వ్యక్తమవుతోందన్నారు.

### టార్గెట్ చేస్తే బుద్ధి చెప్తాం

**నూజివీడు టౌన్:** గౌతులచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రాజకీయం చేసి మంత్రి పార్థసారథి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను టార్గెట్ చేస్తే బుద్ధి చెప్తామని గౌడసంఘ నాయకులు మరీదు శివరామకృష్ణ అన్నారు. నూజివీడు అమర్‌భవన్‌లో గౌడ సంఘ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ రాజకీయపార్టీలకు అతీతుడైన గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణకు అన్ని రాజకీయపార్టీలు కార్మిక సామాజిక సంఘాల నాయకులు స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానించటం జరిగిందని అన్నారు.

### మంత్రి సారథిపై ఆరోపణలు తగవు

ముసునూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ సందర్భంగా నెలకొన్న వివాదంలో మంత్రి కొలుసు పార్థసారథి కి ఎటువంటి సంబంధం లేదని, అది కులపరంగా జరిగిన మీటింగ్ అని, ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని, సారథిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని మండల టీడీపీ, జనసేన నాయకులు ఖండించారు. మంగళవారం ముసునూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో నాయకులు గద్దె రఘుబాబు, మాజీ జడ్పీటీసీ చిలుకూరి వెంకటేశ్వరావు, కొల్లి గంగారామ్, నియోజకవర్గ జనసేన నాయకులు పాశం నాగబాబు తదితరులు మాట్లాడుతూ మంత్రిపై ట్రోల్ చేయడం తగదని పేర్కొన్నారు.

### రెవెన్యూ సదస్సులో ఎనిమిది అర్జీలు

ముసునూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వి రమణ అన్నారు. మంగళవారం కొర్లకుంటలో జరిగిన గ్రామసభలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ భూ సమస్యలపై 8 అర్జీలు వచ్చినట్లు రమణ తెలిపారు. ఈ కార్యాక్రమంలో సర్పంచ్ నక్కనబోయిన సత్యనారయణ, వీఆర్వో మణేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



మంకొల్లులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

### మంకొల్లు, చిన్నంపేటలలో రెవెన్యూ సదస్సులు

చాట్రాయి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మంకొల్లు, చిన్నంపేటలలో మంగళవారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ ప్రశాంతి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మంకొల్లులో 4, చిన్నంపేటలో 4 అర్జీలు భూ సమస్యలపై వచ్చినట్లు అధికారులు చెప్పారు.

### ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

ముసునూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో దివ్యాంగ పిల్లలకు మంగళవారం ఉచిత ఫిజియోతెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.ప్రశాంతి ఐదుగురు పిల్లలకు ఫిజియోతెరపి చికిత్సను అందించి, వారిపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



రైతులకు జిగురు అట్టలను అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బాషా

### రసాయన రహిత పంటలకు కృషి చేయాలి

ముదినేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో రసాయనిక రహిత దిగుబడులను సాధించేందుకు రైతులు కృషి చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎస్‌కె.హబీబ్ బాషా తెలిపారు. ముదినేపల్లి మండలం చిగురుకోట, వడాలి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో జెడి బాషా మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభిస్తే సాగుకు ఖర్చు తగ్గి నాణ్యమైన ధాన్యం దిగుబడులను సాధించవచ్చునన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. ఏడీఏ వెంకటమణి, ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ గౌతం కుమార్, సర్పంచ్‌లు చొప్పరపు వెంకటరమణ, మరీదు దుర్గాశ్రీ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మినుప పైరు రసం పీల్చే పరుగులను అరికట్టేందుకు పసుపు రంగు జిగురు అట్టలను జెడి రైతులకు పంపిణీ చేశారు.

### షష్టి ఉత్సవాల్లో ఏకనామ సంకీర్తన

ముదినేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 13 రోజులుగా జరుగుతున్న షష్ఠి కల్యాణ మహోత్సవాలు బుధవారం ముగియనున్నాయి. ఆలయంలో మంగళవారం ఏకనామ సంకీర్తన (ఏకాహం) కార్యక్రమం ప్రారంభమైంది. చేవూరుపాలెంకు చెందిన రంగిశెట్టి గోవర్ధనరావు దంపతులు రాముడు, కృష్ణుడు, విగ్రహాలతో ఊరేగింపుగా వచ్చి ఆయలంలో పూజలు నిర్వహించిన అనంతరం ప్రారంభమైన ఏకాహం బుధవారం ఉదయం 9 గంటల వరకు జరుగుతుంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం అన్న సమారాధన నిర్వహించనున్నారు. సుమారు 50 వేల మంది జనం వస్తారన్న అంచనాతో సీఎఫ్‌వో చందన, ఏసీ గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

### షర్మిల జన్మదిన వేడుకలు

కైకలూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు నోబుల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈదా పద్మారావు, బి కృష్ణాయాదవ్, దండే సైమన్‌రాజు, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

### కార్గో పాయింట్ తనిఖీ

నూజివీడు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆర్టీసీ బస్టాండులోని కార్గో పాయింట్‌ను ఆర్టీసీ కార్గో మేనేజర్ లక్ష్మీప్రసన్న వెంకటసుబ్బారావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్గో బుకింగ్ తదితర వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి జనవరి 19 వరకు డోర్‌డెలివరీ పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బస్టాండు నుంచి 10కి.మి వరకు ఉచితంగా డోర్‌డెలివరీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.